RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 28 జనవరి 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:200

# దివ్యాంగుల సంక్షేమానికి 100 కోట్లు ఖర్చు చేశాం

**దివ్యాంగుల సంక్షేమానికి 100 కోట్లు ఖర్చు చేశాం**

**రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం**

**మధిర నియోజకవర్గ పరిధిలో దివ్యాశీగులకు రెట్రోఫిటెడ్ మోటారు వాహనాల పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం**










**మధిర ప్రతినిధి జనవరి 27 (ప్రజాబలం)** మధిర నియోజవర్గందివ్యాంగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని గత ప్రభుత్వం పదేళ్ళలో చేయలేని పనులని, ఈ ప్రభుత్వం రెండేళ్లలోనే చేసిందని, అందులో భాగంగానే ఈ రెండేళ్లలో దివ్యాంగుల కోసం 100 కోట్ల రూపాయలని ప్రభుత్వం ఖర్చు చేసిందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర నియోజకవర్గ కేంద్రంలో డిప్యూటీ సీఎం, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూచదువుకుంటున్న దివ్యాంగులకు ఐపాడ్లు, కంప్యూటర్లు ట్యాబ్స్ ప్రజా ప్రభుత్వం అందిస్తోందన్నారు. తమది ప్రజల గురించి ఆలోచన చేసేటువంటి ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వమని అన్నారు. దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూస్తామని, వారికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు దురదృష్టవశాత్తు అంగవైకల్యంతో పుట్టిన వారిని కూడా సమాజంలో మనతో పాటు ముందుకు నడిపించాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది, దివ్యాంగుల గురించి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని అన్నారు. దివ్యాంగులు కూడా అన్ని రంగాలలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. సమాజంలో ఇతరులు కన్నా ఎక్కువ అవకాశాలను, ఆసరాను దివ్యాంగులకు మనం అందించాలని అన్నారు అంగవైకల్యంతో ఉన్నామన్న బాధ వారికి రాకుండా వారిని ప్రోత్సహించి ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం తెలిపారు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఈ ఆలోచన దిశగానే ముందుకు సాగుతోందని అన్నారు ఈకార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య సంస్థ రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఇర్రిగేషన్ ఎస్ఇ వాసంతి విద్యుత్ ఎస్ఇ శ్రీనివాస చారి ఆర్ అండ్ ఎస్ఇ యాకుబ్, జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారావు, వ్యవసాయ శాఖ ఏడి విజయ చందర్, మధిర తహసీల్దార్ రాంబాబు, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**జనవరి 28 నామినేషన్‌లు ప్రారంభం**

**నామినేషన్‌లకు గడువు - జనవరి 30**

**నామినేషన్‌ల (స్క్రూటినీ - జనవరి 31,నామినేషన్‌లు ఉపసంహార ఫిబ్రవరి 3,పోలింగ్ - ఫిబ్రవరి 11,కౌంటింగ్×పోలింగ్ టైమ్ - ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.**




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 27 : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రంలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగనున్నాయి. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు.షెడ్యూల్ విడుదలతో తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నెల 28 వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 30వ తేదీతో నామినేషన్ల స్వీకరణకు గడవు ముగియనుంది. ఈ నెల 31న (స్క్రూటినీ నిర్వహించి పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా వెల్లడించనున్నారు. ఫిబ్రవరి 1న తిరస్కరణకు గురైన నామినేషన్‌లపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 3వ తేదీ నామినేషన్‌ల ఉపసంహరణకు తుదిగడువు. అదేరోజు అభ్యర్థులు తుది జాబితా ప్రకటించనున్నారు.ఈ ఎన్నికల్లో మొత్తం 52 లక్షల 43 వేల మందికిపైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఇదీ షెడ్యూల్నామినేషన్‌లు ప్రారంభం - జనవరి 28,నామినేషన్‌లకు గడువు - జనవరి 30,నామినేషన్‌ల (స్క్రూటినీ - జనవరి 31,నామినేషన్‌లు ఉపసంహరణ - ఫిబ్రవరి 3,పోలింగ్ - ఫిబ్రవరి 11,కౌంటింగ్ - ఫిబ్రవరి 13,పోలింగ్ కేంద్రాలు - 8,195,పోలింగ్ టైమ్ - ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.

# సింగరేణిలో అవినీతి వెలికితీశాక పాలకుల్లో వణుకు మొదలైంది

**తెలంగాణ సీఎం కోల్ మాఫియాకు నాయకుడిలా మారిపోయారు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్**



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 27 సింగరేణిలో అవినీతి వెలికితీశాక పాలకుల్లో వణుకు మొదలైందని. తెలంగాణ సీఎం కోల్ మాఫియాకు నాయకుడిలా మారిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు బొగ్గు గనుల కేటాయింపులపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఫిర్యాదు చేశారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఏ బొగ్గుగనిలో లేని నిబంధన ఇక్కడనే ఎందుకు పెట్టారంటే ఇంతవరకు సమాధానం రాదన్నారు. నిజంగనే 2018 నుంచి 2024 వరకు ఈ నిబంధనను కేంద్రప్రభుత్వం సిఫారసు చేసి ఉంటే.. ఆ రోజున్న బీఆర్ఎస్ ప్రభుత్వం తరపున అన్ని టెండర్లను కూడా మేం పారదర్శకంగా పిలిచినం. అందుకే ఆ రోజు అన్నీ మైనస్ టెండర్లు వచ్చినయ్. ఎస్టిమేటివ్ కంటే తక్కువ ఖర్చుకే సింగరేణికి డబ్బులు ఆదా చేస్తూ ఆ రోజు జరిగిన మాట వాస్తవమా.. కాదా..? అని ప్రశ్నించారు. మరి ఆ రోజు టెండర్లలో లేని షరతు మీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సైట్ విజిట్ సర్టిఫికేషన్ విధానం ఎందుకు పెట్టారు×? ఎవరికి లాభం చేయడానికి పెట్టారు. అంటే ఇంతవరకు ప్రభుత్వంలోని బాధ్యులు ఏ ఒక్కరూ కూడా సమాధానం చెప్పడం లేదన్నారు కేటీఆర్ .2025-26లో నిజానికి జనవరిలో ఈ నిబంధనలు లేకుండా ఒక టెండరు చేశారు. జనవరిలో టెండరు వేస్తారు.. మళ్లీ వెంటనే ఆ టెండరు రద్దు చేశారు. టెండర్లలో ఈ నిబంధన లేకుండా ఆ రోజు మీరు టెండరు పిలిస్తే మైనస్ -7 శాతానికే పనిచేస్తామని (అంటే 100 రూపాయలకు ఎస్టిమేట్ చేస్తే 93 రూపాయలకే పనిచేస్తామని) కాంట్రాక్టు సంస్థలు ముందుకొచ్చాయి. కానీ మీరు దాన్ని రద్దు చేశారు. ఈ నిబంధన పెట్టారు. దాని వల్ల తిరిగి మళ్లీ అదే ప్లేస్‌లో టెండర్ పిలిస్తే +12 (అంటే 100 రూపాయలకు అయ్యే పని 112 రూపాయలు) కావాలని చెప్పి సంస్థలు వచ్చిన మాట వాస్తవమా.. కాదా అని చెప్పాలని ప్రభుత్వాన్ని మేం డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ అన్నారు.

# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

వార్తా 5 లో



వార్తా 5 లో



**ములుగు జిల్లామేడారం జాతర ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలి.**

# ప్రజాబలం

28 జనవరి 2026 బుధవారం


## అన్ సంగ్ హీరోస్ కు పట్టం


పద్మ పురస్కారాలు దేశానికి విభిన్న రంగాల్లో తమ వంతు కంట్రిబ్యూషన్ ఇచ్చిన వారికి ఇచ్చేందుకు స్థాపించినవి. ఆ అవార్డుల ద్వారా వచ్చేది .. వారు దేశానికి సేవ చేశారని గుర్తింపు. కానీ దశాబ్దాల పాటు ఈ అవార్డులు సిఫార్సులు బలంగా చేయించుకున్నవారికే వచ్చేవి. అందుకే వాటిపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. కానీ గత కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పద్దతిని మార్చేసింది. నిజంగా దేశానికి తమ ప్రతిభతో..సేవతో..కళతో సేవ చేసిన వారికే ఇస్తున్నారు. ఈ సారి కూడా ఆ సంప్రదాయం తప్పలేదు.ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పద్మ పురస్కారాల జాబితా, అవార్డుల ఎంపికలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అద్దం పడుతోంది. రాజకీయ సిద్ధాంతాలు, పార్టీ ప్రయోజనాలకు అతీతంగా కేవలం దేశ సేవను, అర్హతను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని పురస్కారాలను అందించడంలో మోదీ ప్రభుత్వం వందకు వంద మార్కులు కొట్టేసింది. కరడుగట్టిన విమర్శకులు సైతం మెచ్చుకునేలా, అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన అసాధారణ వ్యక్తులను వెలికితీసి గౌరవించడం ఒక గొప్ప సంప్రదాయంగా మారింది.గతంలో కాంగ్రెస్ హయాంలో పద్మ పురస్కారాల ఎంపికపై అనేక విమర్శలు ఉండేవి. ప్రధానంగా ఢిల్లీ వర్గాల్లో పట్టున్న వారు, సిఫార్సుల ద్వారా లేదా రాజకీయ పలుకుబడితో ఈ అవార్డులను పొందుతున్నారనే అభిప్రాయం బలంగా ఉండేది. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దరఖాస్తు చేసుకోకపోయినా, ప్రచారానికి దూరంగా ఉంటూ నిశ్శబ్దంగా సమాజ సేవ చేస్తున్న అన్‌సంగ్ హీరోస్ కోసం వెతికి మరీ పద్మ గుర్తింపు ఇస్తున్నారు. ఇది ఒక పారదర్శకమైన, ప్రజాస్వామ్యబద్ధమైన వ్యవస్థకు నిదర్శనం.రాజకీయ వైరుధ్యాలను పక్కన పెట్టి ప్రత్యర్థి పార్టీల నేతలను కూడా వారి సేవలకు గాను సత్కరించడం ద్వారా ప్రధాని మోదీ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. వీఎస్ అచ్యుతానందన్, షిబూ సోరెన్ వంటి నేతల ఎంపికే దీనికి నిదర్శనం. రాజకీయంగా ఎంతటి తీవ్ర విభేదాలు ఉన్నప్పటికీ, ప్రజా జీవితంలో వారు చూపిన ముద్రను ప్రభుత్వం గౌరవించింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పద్మ పురస్కారాల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవకులను గుర్తించింది. ముఖ్యంగా కమ్యూనిస్టు దిగ్గజం, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్‌ను దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మవిభూషణ్' తో గౌరవించడం చర్చనీయాంశమైంది. బీజేపీ ప్రభుత్వ సిద్ధాంతాలకు, అచ్యుతానందన్ ప్రాతినిధ్యం వహించే వామపక్ష భావజాలానికి మధ్య తీవ్ర వైరుధ్యం ఉన్నప్పటికీ, ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని , ప్రజా పోరాటాలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రకటించారు. ఇదే కోవలో జార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి షిబూ సోరెన్‌కు పద్మభూషణ్ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాకుండా, సమాజంపై ప్రభావం చూపిన నేతల సేవలను పరిగణనలోకి తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. భావజాల విభేదాలు ఉన్నప్పటికీ, విపక్ష నేతలకు వారి స్థాయికి తగిన గుర్తింపు ఇవ్వడం ద్వారా కేంద్రం ఒక సానుకూల సంకేతాన్ని పంపింది.పద్మ అవార్డులను ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించింది:పద్మ విభూషణ్: దేశంలో రెండవ అత్యున్నత పౌర పురస్కారం. అసాధారణ, విశిష్ట సేవలకు దీనిని ఇస్తారు.పద్మ భూషణ్: మూడవ అత్యున్నత పురస్కారం. ఉన్నత స్థాయి విశిష్ట సేవలకు గుర్తింపు.పద్మశ్రీ: నాల్గవ అత్యున్నత పురస్కారం. ఏ రంగంలోనైనా ప్రతిభ చాటిన వారికి, ముఖ్యంగా సామాన్యులకు ఇచ్చే గౌరవం.గతంలో ప్రభుత్వమే పేర్లను సూచించేది, కానీ ఇప్పుడు ప్రక్రియ పూర్తిగా మారింది. సామాన్య ప్రజలు కూడా తమకు తెలిసిన అర్హులను నామినేట్ చేయవచ్చు. చివరికి ఎవరికి వారు 'సెల్ఫ్ నామినేషన్' చేసుకునే అవకాశం కూడా ఉంది. ప్రతి ఏటా ప్రధానమంత్రి ఏర్పాటు చేసే ఈ కమిటీ, వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రాష్ట్రపతి ఆమోదానికి పంపిస్తుంది.చాలామంది ఈ అవార్డుతో పాటు డబ్బు వస్తుందని అనుకుంటారు. కానీ, పద్మ అవార్డులతో ఎటువంటి నగదు బహుమతి లేదా నెలవారీ భత్యాలు ఉండవు. వీరికి లభించే మర్యాదలు ఇవే.

సనద్ ఉ మెడల్: రాష్ట్రపతి సంతకంతో కూడిన ప్రశంసా పత్రం (సనద్), ఒక పతకం ఇస్తారు.ప్రభుత్వ అతిథులు: వీరు ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వీరిని 'స్టేట్ గెస్ట్స్'గా పరిగణించి వసతి, రక్షణ కల్పిస్తాయి.రైల్వే పాస్‌లు: నిబంధనల మేరకు భారతీయ రైల్వేలో ఉచిత ప్రయాణ సౌకర్యం లభిస్తుంది.ముఖ్య వేడుకలు: గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానాలు అందుతాయి.పద్మ అవార్డు అనేది ఒక గుర్తింపు మాత్రమే, అది బిరుదు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 18(1) ప్రకారం.. గ్రహీతలు తమ పేరుకు ముందు లేదా వెనుక అని వాడుకోకూడదు.ప్రస్తుతం ఈ అవార్డుల విధానంలో గొప్ప మార్పు వచ్చింది. ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఉండి నిస్వార్థంగా సేవ చేస్తున్న 'అన్‌సంగ్ హీరోస్' (గుర్తింపు లేని వీరులు) ను వెతికి పట్టుకుని ప్రభుత్వం గౌరవిస్తోంది. ఇది కేవలం ఒక పతకం కాదు, భారత గడ్డపై ఆ వ్యక్తి ముద్రించిన అంకితభావానికి నిదర్శనం.కొన్ని సందర్భాల్లో రాజకీయ వ్యూహాల కోసమే కొంతమందికి అవార్డులు ఇస్తున్నారనే వాదనలు వినిపించినప్పటికీ, ఎంపికైన వారి వ్యక్తిగత అర్హతలను ఎవరూ వేలెత్తి చూపలేని పరిస్థితి ఉంది. కళా, సాహిత్య, సామాజిక , క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారిని ఎంపిక చేయడంలో ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయం. రాజకీయం అనేది ఎన్నికల వరకేనని, దేశ గౌరవం విషయానికి వస్తే అందరూ ఒక్కటేననే భావనను ఈ పురస్కారాల పంపిణీ కలిగిస్తోంది. పద్మ పురస్కారాల ఎంపికలో నెలకొన్న ఈ సానుకూల మార్పు దేశంలో ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య సంప్రదాయానికి పునాది వేస్తోంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ, వారు ఏ మూలన ఉన్నా ఏదో ఒక రోజు గుర్తింపు లభిస్తుందనే నమ్మకాన్ని ఈ వ్యవస్థ కల్పిస్తోంది. ఇలాంటి నిష్పాక్షికమైన వ్యవస్థ కొనసాగడం దేశాభివృద్ధికి, సామాజిక చైతన్యానికి ఎంతో అవసరం.

## "బొట్టుగూడ పాఠశాల నిర్మాణం నా చిరకాల కోరిక. పేదవాడు చదువుకోవాలి. చదువుతోనే అభివృద్ధి సాధ్యము"

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 కోట్ల రూపాయల వ్యయంతో నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎలాంటి వసతులు లేకుండా నిర్వహిస్తున్న బొట్టు గూడ పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టి, అధునాతన హంగులు కల్పించాలన్నది తన చిరకాల కోరిక అని అన్నారు. 2500 గజాల స్థలంలో అన్ని అత్యాదునిక వసతులతో బొట్టుగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను నిర్మించడం జరిగిందని, పేదవాడు చదువుకోవాలని ,చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమని మంత్రి అన్నారు. బొట్టు గూడ ప్రభుత్వ ప్రాథమిక ,ఉన్నత పాఠశాల రొటీన్ పాఠశాల కాదని, సంప్రదాయ విద్య కాకుండా అన్ని రకాల నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా ఒక పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా వాల్డాఫ్ విద్యా విధానాన్ని ఈ పాఠశాలలో అమలు చేయడం జరుగుతుందన్నారు. పాత సిలబస్ తో పాటు, సీబీఎస్ఈ ని కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పాఠశాల ద్వారా అనుభవాత్మక విద్యను నేర్పించడం జరుగుతుందని తెలిపారు.

"ఈ రోజుల్లో మనం చూస్తున్న సంప్రదాయ విద్య, ఎక్కువ మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది.

పిల్లలను ఆలోచించేందుకు కాకుండా కేవలం గుర్తుపెట్టుకుని పరీక్షలు రాయమని ఒత్తిడి చేస్తోంది.

ఈ ఒత్తిడిలో పిల్లల సహజ కుతూహలం, సృజనాత్మకత నశించిపోతున్నాయి.

చదువు ఒక ఆనందకరమైన ప్రయాణంగా కాకుండా ఒక పోటీగా మారుతోంది.

ఈ పరిస్థితిని మార్చాలనే ఆలోచనతోనే మేము వాల్డార్ఫ్ విద్యా విధానం నుంచి ప్రేరణ పొందాం.

వాల్డార్ఫ్ విద్య ప్రకారం పిల్లలు మూడు విధాలుగా ఎదగాలి -- ఆలోచన, భావన,కార్యాచరణ.

అందుకే మా పాఠశాలలో అనుభవాత్మక విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

గార్డెన్ పనుల ద్వారా సహనం నేర్పిస్తున్నాం, ప్రకృతితో అనుబంధం పెంచుతున్నాం.

కుండల తయారీ, రాయి చెక్కుదల ద్వారా ఏకాగ్రతను, సృజనాత్మకతను పెంపొందిస్తున్నాం.

ఇసుకతో ఆటల ద్వారా పిల్లల కల్పనాశక్తిని విస్తరిస్తున్నాం. నృత్యం, యోగా ద్వారా శరీరం-- మనస్సుకు సమతుల్యత తీసుకొస్తున్నాం.

ఇండోర్ ఆటల ద్వారా సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలను పెంచుతున్నాం.

అదే సమయంలో పిల్లలు ఆధునిక ప్రపంచంలో పోటీ పడాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని కూడా మేము విస్మరించలేదు.

అందుకే పూర్తిగా డిజిటల్ క్లాస్?రూమ్స్ ఏర్పాటు చేశాం. ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, స్టెమ్ విద్య పరిచయం, మంచి గ్రంథాలయం, స్పోర్ట్స్ రూమ్స్, లిఫ్ట్ సదుపాయం, స్మార్ట్ లెర్నింగ్ టూల్స్--- ఇవన్నీ పిల్లలకు బలమైన సాంకేతిక అవగాహన ఇవ్వడానికే.

ఈ పాఠశాల సంప్రదాయ విద్యకు, వాల్డార్ఫ్ ప్రేరణతో కూడిన విద్యకు మధ్య ఉన్న సమతుల్యమైన సమ్మేళనం.

పాఠ్యాంశాలు మారవు. కానీ వాటిని నేర్చుకునే విధానం మాత్రం మారుతుంది. అదే విషయాల్లో సృజనాత్మకతను, కార్యాచరణను, జీవన నైపుణ్యాలను జోడిస్తున్నాం.

అందుకే మా పిల్లలు బలమైన మౌలిక అవగాహనతో ఎదుగుతున్నారు. వారు పరీక్షలకు సిద్ధంగా ఉంటారు, వృత్తులకు సిద్ధంగా ఉంటారు, అంతకంటే ముఖ్యంగా పోటీజీవితానికి సిద్ధంగా ఉంటారు.

నల్గొండ జిల్లాలో నిరుద్యోగ యువత నైపుణ్యాల పెంపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగానే నైపుణ్యాల అభివృద్ధి సంస్థను నిర్మించడం జరిగిందని తెలిపారు. ఉస్మానియా ,కాకతీయ తర్వాత మహాత్మా గాంధీ యూనివర్సిటీనే అతిపెద్ద యూనివర్సిటీగా ఉందని, ఇటీవలే మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఎల్ ఎల్ బి ,బీ ఫార్మసీ, కోర్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఎస్ఎల్ బీసీ వద్ద నిర్మిస్తున్నామని ,రాష్ట్రవ్యాప్తంగా 20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. పిల్లలపై ఒత్తిడి లేకుండా విద్య నేర్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం అన్నారు.

నల్గొండ అభివృద్ధిలో భాగంగా 800 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు తీసుకొని రావడం జరిగిందని, రానున్న రెండేళ్లలో నల్గొండ రూపురేఖలను మార్చడం జరుగుతుందని అన్నారు. బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల ద్వారా మంచి విద్యను అందించడం పై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ,పాఠశాల ద్వారా ఆణిముత్యాల లాంటి విద్యార్థులను తయారు చేయాలని, ఐఏఎస్, ఐపీఎస్, సైంటిస్టులను తీర్చిదిద్దాలని, అలాగే పేదవారి చదువు కోసం సహకారం అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బొట్టు గూడ పాఠశాల ప్రవేశాల ఆధారంగా అవసరమైతే అదనపు గదులను నిర్మిస్తామని ఆయన వెల్లడించారు .

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ బొట్టు గూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను 8 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మించడం అభినందనీయమని అన్నారు. ఈ పాఠశాలలో చదువుతోపాటు, ఇతర కార్యక్రమాలను నేర్పించడం జరుగుతుందని, నేర్చుకోవాలనే తపనతోనే పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆర్టిఫిషియల్ అభ్యసన ద్వారా విద్యను అందించడం జరిగిందని, క్రాఫ్ట్, ఆర్ట్ టీచర్స్ సైతం ఈ పాఠశాలకు డెప్యూటషన్ పై పంపడం జరిగిందన్నారు. పాఠశాల ద్వారా మంచి పౌరుడిగా ,బాధ్యతగల పౌరుడిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు బొట్టుగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపయోగపడుతుందన్నారు.

ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ దేశంలోనే బొట్టుగూడ లాంటి పాఠశాల ఉండదన్నారు.

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, ఆర్ డి ఓ వై. అశోక్ రెడ్డి ,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్,ప్రతీక ఫౌండేషన్ సీఈఓ గోనా రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి లు మాట్లాడారు.

బొట్టుగూడ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన లైబ్రరీ, పాఠశాల ఇండోర్ గేమ్స్, కంప్యూటర్ ల్యాబ్ లు, అన్నింటిని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి కలియతిరిగారు .

ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పలువురు అధికారులు, పాఠశాల హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగుల హక్కులను కాపాడుతాం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



ఉద్యోగస్తుల హక్కులను కాపాడుతాం. ముఖ్యంగా మైనారిటీ ఉద్యోగస్తుల హక్కులు కాపాడుతామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు.మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ 2026 డైరీ, క్యాలెండర్ను చిన్నారెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా మైనార్టీలకు రావలసిన హక్కులను కాపాడటంలో అవసరమైతే పోరాటం చేసి వాటిని అమలు అయ్యేట్లు కాంగ్రెస్ పార్టీ పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ మేవావా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్ వహీద్ షా ఖాద్రి, కోశాధికారి ఏం. ఏ. రషీద్, రాష్ట్ర నాయకులు జావేద్ అహ్మద్, తక్వుద్దీన్ అహ్మద్, ప్రవాస భారతీయుడు ముహమ్మద్ వాజీద్, సయ్యద్ అజమ్ హుస్సేన్, ఖాజా ఫరూఖ్ అలీ, ముంతాజ్ అలీ, అతి ఖుర్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు

## డివిజన్ల విభజన అశాక్ష్మయంగా జరిగింది జిహెచ్ఎంసి ఎన్నికల పై ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్ జనవరి 27 జిహెచ్ఎంసి డివిజన్ల విభజన అశాక్ష్మయంగా జరిగిందని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.జిహెచ్ఎంసి డివిజన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి.ఒక దగ్గర 82 వేలు ఉంటే మరో దగ్గర 12 వేలు జనాభా మాత్రమే ఉంది. ఇది ఆశాక్ష్మయంగా ఉంది. రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని కాకుండా ప్రజల సౌకర్యార్థం 30 వేలు ఒక్కొక్క కార్పొరేటర్ కి సమానంగా డిస్ట్రిబ్యూట్ చెయ్యాలని,.పారదర్శకత్వంతో రిజర్వేషన్ కూడా కేటాయించాలని డిమాండ్ చేసారు .స్థానిక సంస్థలు బలోపేతం కాకుండా వాటిల్లో పరిపాలన లేకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వం వ్యవస్థ నడుపుతామంటే అది వెర్రి బాగులతనం అవుతుంది.ఇలాంటి నిర్ణయం తీసుకునేటప్పుడు కనీసం పార్టీలతో ప్రజాప్రతినిధులతో చర్చలు జరపాలి. నాకే అన్నీ తెలిసినట్టు రేవంత్ రెడ్డి సర్కారు చేస్తుంది ఇది మంచి పరిణామం కాదు. రాజకీయ లబ్దికోసం చిల్లర రాజకీయాల కోసం విభజన చేయవద్దని హితవు పలికారు.

# భీమేశ్వరాలయంలో మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది.

# రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీసిన మంత్రి పొన్నం.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మంత్రి పొన్నం ఈ సందర్భంగా మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన సందర్భంగా ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు, 116 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొన్ని అనివార్య కారణాలవల్ల పది మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగడంలేదని తెలిపారు. అన్ని మున్సిపాలిటీలలో, కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా పాలన ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో మున్సిపాలిటీలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మున్సిపాలిటీలలో ప్రభుత్వం అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు.

గత ప్రభుత్వంలో పది సంవత్సరాలుగా ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. గత బి ఆర్ ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే రాజకీయాలకి అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నామని, రేషన్ కార్డులు ఇవ్వడం ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే తెల్ల రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేస్తున్నమని పేర్కొన్నారు. పేద ప్రజలకు నెలకు ×1000 కరెంటు బిల్లు కట్టే పరిస్థితి ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలు ఎక్కడికి వెళ్లినా వేములవాడ, సమ్మ క్కసారాలమ్మ జాతరకి వెళ్లిన ఉచితంగా టీజీఎస్ఆర్టిసి బస్సులలో ప్రయాణం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో 9వేల కోట్ల విలువైన ప్రయాణం మహిళలు ఉచితంగా చేశారని, అట్టి డబ్బులను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుంది అని పేర్కొన్నారు. రైతాంగానికి రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లించామని పేర్కొన్నారు. నిరుద్యోగులు గత పది సంవత్సరాలుగా ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ ద్వారా వేగంగా భర్తీ చేస్తున్నమని తెలిపారు. తెలంగాణ విజన్ 2047 ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నాం అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కేటీఆర్ బాకీ కార్డు పట్టుకొని తిరిగారని, అయినా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించారని, ఉప ఎన్నికలలో, సర్పంచ్ ఎన్నికలలో ఓడిపోయి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కెసిఆర్ కూతురు, కేటీఆర్ సోదరి, హరీష్ రావు మరదలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు బిఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కొంతమంది నాయకులకు వేములవాడ ఉందని కూడా జ్ఞాపకం లేదన్నారు. 12 సంవత్సరాలుగా వేములవాడకి అమృత్ ఎందుకు తేలేదని, ఇప్పుడు వేములవాడకి అమృత్ తీసుకొస్తామని చెబుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. వేములవాడకి అమృత్ ఇవ్వండి స్వాగతిస్తాం, కానీ ఎన్నికల కోసం అమృత్ ఇస్తామని అంటే పొరపాటు అవుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా వేములవాడ అభివృద్ధిపై డిమాండ్ చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్థానిక శాసనసభ్యుడు మొత్తం క్యాబినెట్ ముఖ్యమంత్రి వేములవాడకు వచ్చి అభివృద్ధి పనులకు 150 కోట్ల రూపాయలతో శంకుస్థాపన చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నయని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉద్యమించాం, అధికారంలోకి రాగానే నెరవేరుస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అప్రకటిత కరెంటు తొలగింపు ఉంటుందని అన్నారని, రాష్ట్రంలో ఎక్కడైనా కరెంటు పోతుందా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఎక్కడ ఇబ్బంది లేదు అన్నారు. వేములవాడ బస్ స్టేషన్ స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ కోరిక మేరకు అభివృద్ధి చేస్తామన్నారు. మంగళవారం రోజు ఉదయం శంకుస్థాపన చేసుకోవాల్సింది, కానీ టెండర్ ప్రక్రియ జరుగుతుంది అన్నారు.

చందుర్తి బస్టాండును కూడా అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి అని, అర్బన్ అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, విద్య, వైద్యం బాగుండేలా చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల తొలగింపు ఉండదని, జిల్లాలు తొలగిస్తామని ఎవరు అనలేదని పేర్కొన్నారు. సాంకేతికంగా హద్దులు వద్ద ఇబ్బందులు ఉన్నాయని హుస్నాబాద్ నియోజకవర్గాన్ని బలవంతంగా సిద్దిపేటలో కలిపారని, దానిని తిరిగి కరీంనగర్లో కలుపుతాం అని పేర్కొన్నారు. సిట్టింగ్ జడ్జితో కమిటీ వేసి, డి లిమిటేషన్ చేసిన తర్వాత ఆ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, సీనియర్ నాయకుడు కూరగాయల కొమురయ్య, అరుణ్ తేజ చారి, కట్కూరి శ్రీనివాస్, మంత్రి నాగభూషణం, పాత సత్యలక్ష్మి, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాలో 54 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు.

### 35,986 మంది విద్యార్థులు హాజరు.అదనపు కలెక్టర్( రెవిన్యూ )మాధురి






**. సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 27(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ఇంటర్ పరీక్షలు - 2026 జిల్లాలో వచ్చేనెల ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్మీడియట్ బోర్డు షెడ్యూల్ ప్రకారం ఇంటర్ బోర్డు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లుపూర్తి చేయాలని అదనపు కలెక్టర్( రెవిన్యూ ) మాధురి అధికారులను ఆదేశించారు,మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షలు ఏర్పాట్లపై పోలీస్ ,రెవెన్యూ ,పోస్టల్ శాఖ,ఇంటర్మీడియేట్ బోర్డు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 54 పరీ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ పరీక్షలకు 35,986 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు, ఆదివారాలు కూడా కలుపుకొని, రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.00 నుంచి 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 నుంచి 5.00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు .ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విభాగంలో 15,897 మంది, వొకేషనల్లో 1,865 మంది కలిపి మొత్తం 17,762 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు,రెండో సంవత్సరంలో జనరల్లో 16,316 మంది, వొకేషనల్లో 1,908 మంది కలిపి 18,224 మంది విద్యార్థులు హాజరవుతారని, మొత్తం మీద 35,986 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు,అన్ని పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో, ఇంటర్ బోర్డు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీ కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. సిబ్బంది, ఇన్విజిలేటర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సకాలంలో పరీ కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ యాజమాన్యం రవాణా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి పరీ కేంద్రంలో తగిన మౌలిక సదుపాయాలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు .మాల్ ప్రాక్టీసులు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం పర్యవేక్షణ చేస్తాయని స్పష్టం చేశారు. విద్యార్థులు హాల్‌టికెట్లతో నిర్ణీత సమయానికి ముందే పరీ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు,ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవిందరామ్,సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, కలెక్టరేట్ ఏఓ అంథోని ,సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దండేపల్లి మండల వ్యవసాయ అధికారిని సన్మానించిన ఫర్టిలైజర్స్,సీడ్స్,డీలర్స్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 27 :** మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండల వ్యవసాయ అధికారి గొర్ల రంజిత్ కుమార్ ను దండేపల్లి మండల ఫర్టిలైజర్,సీడ్స్,డీలర్స్ కలిసి వ్యవసాయ అధికారిని సన్మానించడం జరిగింది. మంగళవారం ఈ సందర్భంగా డీలర్స్ మాట్లాడుతూ...దండేపల్లి మండలం వ్యవసాయ అధికారి కి ఉత్తమ అధికారిగా వచ్చినందుకు చాలా సంతోషమని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఫర్టిలైజర్స్,సీడ్స్,డీలర్స్,తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగని అవమాన పరిచే విధంగా రామారావు డ్రామా కంపెనీ డ్రామా చేసింది




హైదరాబాద్ జనవరి 27;రాజ్యాంగని అవమాన పరిచే విధంగా బీఆర్ఎస్ భవన్ లో రామారావు డ్రామా కంపెనీ డ్రామా చేసిందని టీపీసిసి వైస్ ప్రెసిడెంట్ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం ఏ ఫహీమ్ విమర్శించారు.గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ లోక్ సభ, రాజ్యసభ ప్రతిపక్ష నేతలను, స్పీకర్ ని, సిఎం అవమాన పరిచే విధంగా చేశారు రాజ్యాంగని అవమాన పరిచే విధంగా డ్రామా చేసిన మీరు నైతిక విలువల గురించి మాట్లాడుతున్నారా...! అని దుయ్య బట్టారు.గతంలో ఇతర పార్టీ లో గెలిచిన వారిని మీ పార్టీ లోకి ఎలా తీసుకున్నారు.తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలంగాణ వ్యతిరేకి..అలాంటి వ్యక్తికి వేరే పార్టీ లో నుండి తీసుకొని మంత్రి పదవి ఇచ్చింది మర్చిపోయ్యారా.పీసీసీ గా ఉన్నప్పుడు రేవంత్, కోదండరాం ఇంటికి వెళ్ళి తలుపులు పగలగొట్టి అరెస్ట్ చేసిన్నప్పుడు ఏమైంది మీ విలువలు...ముమ్మాటికీ బీఆర్ఎస్ దళిత వ్యతిరేకి, దళిత ద్రోహులు..దళితుడిని సిఎం చేస్తా అన్నారు.మూడేకరాల భూమి ఇవ్వలేదు, నేరెళ్ల ఘటన మర్చిపోయారా..స్పీకర్ ఎంతో మంచి వ్యక్తి దళిత సామజికవర్గానికి చెందిన వ్యక్తి ని రాజ్యాంగ బద్ద పదవిలో ఉన్నవరని అవమాన పరిచే విధంగా డ్రామా చేశారు.నైతిక విలువ గురించి మాట్లాడాలి అంటే చర్చకు రండి...నకిలీ నోట్లు పట్టు పడ్డ వ్యక్తి(ప్రధని రామ్మోహన్ ) కి పదవి ఇచ్చారు అప్పుడు మీ నైతిక విలువలు ఎక్కడికి పొయ్యాయి.టిల్లు, డ్రామా రావు నీకు నైట్ తిరిగే అలవాట్లు ఉన్నాయి.మంత్రిగా ఉన్నప్పుడు ఫిల్మ్ నగర్ లో తిరిగి డ్రామాలు వేయడం నేర్చుకున్నావుఇంకా ఆది మర్చిపోలేదు అందుకే ఇలాంటి డ్రామాలు వేస్తున్నావని అన్నారు..బిడ్డ కేటీఆర్ గుర్తు పెట్టుకో ఒక మొగోడు దావోస్, న్యూ యర్క్ లో చూస్తున్నాడు.ఆ మొగోడు త్వరలోనే వస్తాడు నీ డ్రామాలకు ఒక క్లైమాక్స్,ఎండ్ ఇస్తారు..పార్టీ లో చర్చించి స్పీకర్ పై డ్రామా వేసినందుకు ఎలా ముందుకి వెళ్ళలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

## ఇండియా-ఈయూ ట్రేడ్ డీల్.. పలు వస్తువులపై ధరలు తగ్గే ఛాన్స్



న్యూ డిల్లీ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియా-ఈయూ మధ్య సోమవారం చారిత్రక ట్రేడ్ డీల్ కుదిరిన సంగతి తెలిసిందే. ఇది స్వేచ్ఛాయుత ఎగుమతులు, దిగుమతులు దోహదపడుతుంది. ఈ డీల్ వల్ల అటు యూరప్‌లో, ఇటు ఇండియాలో అనేక ఉత్పత్తులు, సేవల ధరలు తగ్గే అవకాశం ఉంది. యూరప్ నుంచి దిగుమతి చేసుకునే వాటిపై పన్నులు తగ్గుతాయి. దీంతో ఈయూ నుంచి దిగుమతి చేసుకునే చాలా ఉత్పత్తులు మనకు చౌకగా లభిస్తాయి.ప్రధానంగా ధరలు తగ్గే అవకాశం ఉన్న ఈయూ ఉత్పత్తులివి. లగ్జరీ కార్లపై ప్రస్తుతం 70-110 శాతం పన్నులు ఉన్నాయి. కానీ, కొత్త డీల్ ప్రకారం 40 శాతం వరకు మాత్రమే పన్నులు ఉంటాయి. అంటే లగ్జరీకార్లు అయిన బీఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, వోక్స్ వాగన్, రెనాల్ట్ వంటి కార్ల ధరలు తగ్గుతాయి. లగ్జరీ క్లాతింగ్ బ్రాండ్స్, లెదర్ ఉత్పత్తులు అంటే ఎక్కువగా యూరప్ ప్రొడక్టులే ఉంటాయి. ప్రస్తుతం వీటిపై 10 శాతం వరకు పన్ను ఉంటే.. కొత్త డీల్ ప్రకారం ఈ పన్నులు తగ్గుతాయి లేదా పూర్తిగా తొలగిస్తారు. దీంతో దుస్తులు, పాదరక్షలు, హ్యాండ్ బ్యాగ్స్, వాచీలు వంటి వాటి ధరలు తగ్గుతాయి. అలాగే వైన్ ఆల్కహాల్ ఉత్పత్తులపై ప్రస్తుతం 150 శాతంపైగా పన్నులు విధిస్తున్నారు. ఇకపై వాటిపై 10 శాతం వరకే పన్నులు ఉంటాయి.అంటే ఆల్కహాల్ ఉత్పత్తుల ధరలు భారీగా తగ్గుతాయి. అలాగే కొన్ని రకాల ఔషధాలు, కెమికల్స్ ధరలు కూడా తగ్గుతాయి. మన దగ్గర యూరప్ చాక్లెట్స్, పాస్తా, నూడిల్స్, డ్రింక్స్ వంటి ప్రాసెస్డ్ ఫుడ్స్ బాగా సేలవుతుంటాయి. వీటిపై ప్రస్తుతం 50 శాతం పన్నులు ఉండగా.. ఈ పన్నుల్ని భారీగా తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం చేస్తారు. దీంతో ఈ ఆహారోత్పత్తుల ధరలు కూడా అందుబాటులోకి వస్తాయి. వీటితోపాటు మనం దిగుమతి చేసుకునే ఆలివ్ ఆయిల్, ఫ్రూట్ జ్యూస్‌ల ధరలు కూడా తగ్గుతాయి

# త్వరలో లోకేష్ కు పట్టాభిషేకం



విజయవాడ, జనవరి 27, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పట్టాభిషేకానికి ముహూర్తం రెడీ అయిందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి గా నారా లోకేశ్ ను వచ్చే ఏడాది చేయాలని అంతా సిద్ధం చేస్తున్నట్లు పార్టీలోనూ జోరుగా చర్చ జరుగుతుంది. ఇప్పటికే ఢిల్లీలోనూ ఈ మేరకు బీజేపీ కే?ంద్ర పెద్దలతో ఈ విషయం చర్చించినట్లు సోషల్ మీడియాలో పోస్టులు కనపడుతున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ భావినేతగా నారా లోకేశ్ ఇటు క్యాడర్ లోనూ, అటు నేతల్లోనూ ఫిక్సయిపోయారు. అయితే ముఖ్యమంత్రి పదవి చేపట్టే దెప్పుడు అన్న దానిపైనే జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి పదవి అన్న ప్రచారం జరిగినా దానిని కొట్టిపారేస్తూ ముఖ్యమంత్రి పదవి ఇవ్వడమే మంచిదన్న అభిప్రాయంలో నారా కుటుంబం ఉందని తెలిసింది.నారా లోకేశ్ పార్టీపైనా, ప్రభుత్వంపైన ఇప్పటికే పట్టు సంపాదించుకున్నారు. ఆయన విద్య, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ అన్ని శాఖల బాధ్యతను నారా లోకేశ్ పర్యవేక్షిస్తున్నారు. ఇక ఢిల్లీ స్థాయిలో చంద్రబాబు తో సమానంగా పర్యటిస్తూ కేంద్రమంత్రులను, బీజేపీ పెద్దలను తరచూ కలసి వస్తున్నారు. నారా లోకేశ్ ఎప్పటికైనా ఈ పదవి ఇవ్వడం తప్పదు. టీడీపీ క్యాడర్ అభిప్రాయం కూడా అదే. అయితే చంద్రబాబు నాయుడు ఈ టర్మ్ ముఖ్యమంత్రిగా చేసిన తర్వాత వచ్చే ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే అప్పుడు నారా లోకేశ్ ను ముఖ్యమంత్రిని చేద్దామని భావించినప్పటికీ కొన్ని కారణాలతో వచ్చే ఏడాది.. అంటే సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్లకు ముందుగానే ముఖ్యమంత్రిగా నారా లోకేశ్ ను చేయాలని నారా కుటుంబం ఫిక్సయినట్లు వార్తలొస్తున్నాయి.తెలంగాణలో బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేదు. 2023 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయింది. అందుకే ఈసారి నారా లోకేశ్ ను ముందుగానే ముఖ్యమంత్రిని చేసి ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో చంద్రబాబు కూడా ఉన్నారని తెలిసింది. చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళతారన్న ప్రచారం కూడా గత కొద్ది రోజులుగా జరుగుతుంది. అందుకే మంత్రి వర్గ సమావేశానికి ముందు టీడీపీకి చెందిన మంత్రులతోనూ, పార్లమెంటు సమావేశాలకు ముందు పార్లమెంటు సభ్యులతో నారా లోకేశ్ సమావేశమయి వారికి దిశానిర్దేశం చేయడం కూడా ఆ ఆలోచనల్లో భాగమేనని అంటున్నారు. ముందుగా మంత్రివర్గ విస్తరణ చేయడంతో పాటు జగన్ పాదయాత్ర ప్రారంభం కాకముందే నారా లోకేశ్ ను ముఖ్యమంత్రి పదవి పై కూర్చోబెట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లు బలంగా అమరావతిలోనూ టాక్ వినిపిస్తుంది. మరి ఇది ప్రచారమా? లేక నిజంగా జరుగుతుందా? అన్నది చూడాలంటే మరికొన్ని నెలలు వేచి చూడక తప్పదు.

గుంభనంగా క్యాడర్

చంద్రబాబు నాయుడు పాలనలో కొన్ని లోపాలు జగన్ తనకు అనుకూలంగా మలచుకునే అవకాశాలున్నాయి. కానీ టీడీపీ నాయకత్వం లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. ఎమ్మెల్యేల అవినీతి ఆరోపణలతో పాటు పార్టీ కార్యకర్తలను పట్టించుకోకపోవడం కూడా ఈసారి టీడీపీకి అననుకూలత అని చెప్పాలి. చంద్రబాబు నాయుడు ప్రతి నియోజకవర్గంలో పర్యటనకు వెళ్లినప్పటికీ అక్కడ టీడీపీ నేతలతో సమావేశం అవుతున్నా.. తాను చెప్పదలచుకున్నది చెప్పి వచ్చేస్తున్నారు. అంతే తప్ప వారి బాధలను, కష్టాలను కూడా స్వయంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. తాను చెప్పదలచుకున్న విషయాన్ని మాత్రం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు.ఇక నారా లోకేశ్ కూడా క్యాడర్ ను పట్టించుకునే తీరిక.. సమయం ఆయనకు లేదు. కార్యకర్తలకు భరోసా ఉంటానని చెప్పిన లోకేశ్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. కనీసం టీడీపీ సోషల్ మీడియాలో కనిపించే నెగిటివ్ ఒపీనియన్ లను కూడా లోకేశ్ కు టీం చేర వేసే ప్రయత్నం చేయడం లేదు. దీంతో ఆల్ ఈజ్ వెల్ అన్న ఫీలింగ్ లో ఉన్నారు. కూటమిలోని మూడు పార్టీలు కలసి ఉంటే జగన్ ను సులువుగా ఓడించగలమన్న ధైర్యం మాత్రమే తండ్రీకొడుకుల్లో కనపడుతుంది తప్ప.. క్యాడర్ కష్టాలను పట్టించుకోవాలన్న ధ్యాస మాత్రం ఇసుమంతైనా పెట్టడం లేదు. అదేమంటే రాష్ట్రాభివృద్ధి కోసం అంటూ రాగాలు తీస్తున్నారు.దీంతో స్థానిక శాసనసభ్యులు కనీసం టీడీపీ శ్రేణులకు కూడా అందుబాటులో ఉండటం లేదు. స్థానిక నాయకత్వం వారి నుంచి ఏమి ఆశిస్తున్నారో తెలుసుకోవలసిన బాధ్యతను వారిద్దరిలో ఎవరో ఒకరు తీసుకోకపోతే పార్టీకి నష్టం వాటిల్లుతుంది. జగన్మోహన్ రెడ్డికి ఉన్న ఫిక్సడ్ ఓటు బ్యాంక్‌ను కదిలించటం చాలా కష్టం. టీడీపీకి ఉన్న ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవాలి, తటస్థ ఓటర్లను మెప్పించాలి. ప్రస్తుతం ఉన్న తీరులో టీడీపీ శ్రేణులే స్తబ్దుగా ఉన్నారు. చంద్రబాబు, లోకేశ్ లుపాలనలోనే మునిగిపోవటం టీడీపీకి నష్టం చేస్తుందేమో అన్న ఆందోళన టీడీపీని అభిమానించే వారిలో ఉన్నారు. ఏ ఏ వర్గాలు కూటమి ప్రభుత్వం పాలనపై అసంతృప్తిగా ఉన్నారన్న ప్రయత్నం చేయకపోగా.. సూపర్ సిక్స్ అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం వల్ల నష్టం తప్ప లాభం ఏమీ ఉండదన్నది ఇప్పటికైనా పసుపు పార్టీ నాయకత్వం గుర్తించ గలిగితే కొంత నష్టనివారణ చేపట్టవచ్చు.

# ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అవమానించాలనే మూడో వరుసలో కూర్చోబెట్టారు

**కుట్ర పూరితమైన అవమానాలికి పాల్పడ్డ బీజేపీ ప్రభుత్వం**

**మోదీ సింహాసనం మీద కూర్చుంటే నే...ప్రధాని అంటారు**

**రాహుల్ సింహం .. సింహం కి సింహాసనం అవసరం లేదు.**

**సింహం ఎక్కడ కూర్చుంటే అదే సింహాసనం**

**ప్రియాంక గాంధీ చిరుత పులి పార్లమెంట్ లో మోదీ నీ పులిలా వెంటాడింది×టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 27 రాహుల్ గాంధీ సింహం లాంటి వాడు..ప్రియాంక గాంధీ చిరుత పులి లాంటి నాయకురాలు ఐనప్పటికీ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అవమానించాలనే మూడో వరుసలో కూర్చోబెట్టింది బీజేపీ ప్రభుత్వం ఇది కుట్ర పూరితమైన అవమానాలికి పాల్పడ్డదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ బీజేపీ కి ప్రజలు.. ప్రజా పాలన చేయండి అని




అధికారం ఇచ్చారు... కానీ రాహుల్ గాంధీ కుటుంబాన్ని రాజకీయంగా టార్గెట్ చేయమని కాదన్నరు. మోదీ సింహాసనం మీద కూర్చుంటే నే ప్రధాని అంటారు.కానీ రాహుల్ గాంధీ ఎక్కడ కూర్చున్నా..అది సింహాసనమే వాజ్ పాయి.. అద్వానీ లాంటి వాళ్లను ప్రతిపక్ష నాయకుడిగా గౌరవించారు ఇందిరాగాంధీ కానీ మోదీ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అవమానించడమే పనిగా పెట్టుకున్నారు కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలోమంచి సాంప్రదాయాలు ప్రజలకు అందించిందికానీ బీజేపీ సాంప్రదాయాలను తుంగలో తొక్కుతున్నారని నిప్పులు చెరిగారు. బీజేపీ ధర్మం అంటారు కానీ పాటించరు జాతీయ కాంగ్రెస్ పార్టీ పాటిస్తుంది . గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాజకీయ సంప్రదాయం ఎలా ఉండేది..? ఇప్పుడు ఎలాంటి సంప్రదాయం వచ్చింది..? . స్వాతంత్రం వచ్చిన తర్వాత.. నెహ్రూ..ఇందిరా గాంధీ... రాజీవ్ గాంధీ... సోనియా గాంధీ లు సంప్రదాయాలు పాటించారు. ప్రధాని జెండా ఎగరేస్తే.. ప్రతిపక్ష నాయకుడు ముందు వరుసలో కూర్చోబెట్టేవారు. అది రాజ్యాంగం ఇచ్చిన మర్యాద... ప్రజలు ఇచ్చిన హక్కు . 26 జనవరి వేడుకల్లో రాహుల్ గాంధీని మూడో లైన్ లో కూర్చోబెట్టి అవమాన పరిచారు . బీజేపీ ప్రవర్తన ప్రజలు గమనించాలి . మోదీ ప్రభుత్వం సాంప్రదాయాలు పక్కన పెట్టింది రాహుల్ గాంధీ ఏం ఫీల్ కారు.. ఎందుకు అంటే రాహుల్ గాంధీ ఇంట్లోనే ప్రధాని పోస్ట్ పుట్టిందిమోదీ ఇంట్లో ప్రధాని పోస్ట్ పుట్టలేదు ప్రధాని పోస్టు పుట్టిందే రాహుల్ గాంధీ ఇంట్లోన్యాయమైన పాలన...పేదలకు అండగా ఉండే పాలన.. అందించింది రాహుల్ గాంధీ కుటుంబం.ఐదో వరసలో కూర్చోబెట్టినా... రాహుల్ గాంధీ ఏం ఫీల్ కారు 47 ఏండ్లు రాహుల్ గాంధీ కుటుంబం దేశాన్ని పాలించిందిపద్ధతి లేని పాలన.. కనపడుతుందిరాహుల్ గాంధీ ఆలోచన... మాట..ప్రవర్తన అంతా సింహం లాగ ఉంటుందిసింహం కి సింహాసనం అవసరం లేదు..సింహం ఎక్కడ కూర్చుంటే అదే సింహాసనంమోదీ సింహాసనం మీద కూర్చుంటే నే...ప్రధాని అంటారుప్రియాంక గాంధీ పార్లమెంట్ లో మోదీ నీ పులి లెక్క వెంటాడింది బీజేపీ నీ దేశ ప్రజలు మంచి పాలన ఇవ్వండి అని అధికారం ఇచ్చారు కానీ రాహుల్ గాంధీ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలని అధికారం ఇవ్వలేదు ప్రజలురాహుల్ గాంధీ కుటుంబం పై రాజకీయంగా కుట్రలు చేయడం మానుకోండివాజపేయి లాంటి వాళ్ళు పార్లమెంట్ లో ఉండాలి ..ప్రతిపక్షం సభలో ఉంటేనే లోటుపాట్లు తెలుస్తాయి అని ఇందిరాగాంధీ గౌరవం ఇచ్చేదివాజ్ పాయి.. అద్వానీ లాంటి వాళ్లకు ముందు వరుసలో కూర్చోబెట్టి మర్యాద ఇచ్చింది ఇందిరా.. రాజీవ్ గాంధీ..ఎందుకు సంప్రదాయాలు పక్కన పెడుతున్నారుఇప్పుడున్న జనరేషన్ కి ఏం చెప్పదలచుకుంటున్నారుధర్మం అంటారు..దాన్ని పాటించరుదేవుడు అంటారు.. పద్ధతులు పాటించరుప్రధాన మంత్రులు వస్తారు పోతారు కానీ చరిత్రను కాలరాయలేరుఒక్క నిజాం ను వదిలేసి... మిగిలిన నిజాం నవాబులను ప్రజలు గుర్తు చేసుకుంటారుబీజేపీ ఎంత సేపు ప్రజల్లోకి చెడును ఎలా జొప్పించాలి అనేది చూస్తుందిప్రజలను ట్రాప్ చేయడం ఎలా అనేదే బీజేపీ పాలసీ..అంతకు మించి ఏం లేదు

# వైసీపీకి ఆల్ ఈజ్ వెల్ కాదా

విజయవాడ, జనవరి 27 వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైకి ఆల్ ఈజ్ వెల్ అన్నట్టు ఉంది. 40% ఓటు బ్యాంకు ఉంది కాబట్టి తామే అధికారంలోకి వచ్చేస్తాం అంటూ ఆ పార్టీ కలలు కంటోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలతో దూసుకుపోతోంది. కేవలం సహజమైన ప్రభుత్వ వ్యతిరేకత తప్ప.. పతాక స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పాలన రెండేళ్ల పాటు సజావుగా నడిచిపోయింది. ఇటువంటి తరుణంలో తమను గట్టెక్కించేది నేషనల్ మీడియా అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు నేషనల్ మీడియా సర్వేల పేరిట వైసీపీకి అనుకూల ఫలితాలు కూడా ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు విరుద్ధ తీర్పు ఇచ్చారు. అయినా సరే నేషనల్ మీడియా జపం వదలడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మీడియా మద్దతు ఉంది. సొంత మీడియా సాక్షి అనుకూల ప్రచారం చేస్తోంది. కానీ ఆశించిన మైలేజ్ రావడం లేదు. మరోవైపు తెలుగులో ప్రముఖ న్యూస్ ఛానల్ గా ఉన్న రెండు మీడియాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయి. ఆపై సోషల్ మీడియా సైన్యం కూడా ఉంది. కానీ ఎందుకో పార్టీకి తగిన మైలేజ్ రావడం లేదు. అందుకే ఆ పార్టీ పునరాలోచనలో పడింది. నేషనల్ మీడియా సేవలను వినియోగించుకోవాలని చూస్తోంది. గతంలో ఇండిగో సంక్షోభ సమయంలో ఓ టిడిపి నేత మాట్లాడిన మాటలను పట్టుకొని.. లోకేష్ కు వ్యతిరేకంగా సదరు మీడియా ఛానల్ ప్రచారం చేసింది. తరువాత కూడా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా హడావిడి చేసింది.తాజాగా దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు ఓ నేషనల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన విషయంలో మాట్లాడే క్రమంలో చిన్నపాటి తప్పిదం దొర్లింది. దానిని వెంటనే సవరించుకున్నారు. తప్పును సరిదిద్దుకున్నారు. కానీ సదరు మీడియా ఉద్దేశపూర్వకంగా ఎడిట్ చేసిన చంద్రబాబు వ్యాఖ్యలను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేసింది. దానిని పట్టుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రెచ్చిపోయింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రచారం చేసింది. ఈ పరిస్థితులన్నింటినీ గమనిస్తే నేషనల్ మీడియాతో వైసిపి ఒప్పందం చేసుకుందాం అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఓ మీడియాకు ప్రకటనలతో పాటు ప్యాకేజీ రూపంలో భారీగా ముట్ట చెప్పారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో సర్వేల రూపంలో సదరు మీడియా వైసిపికి అనుకూల ఫలితాలు ఇచ్చేది. ఇప్పుడు కూడా అటువంటి ప్రయత్నాలు ఏవైనా మొదలయ్యాయా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్లాన్ చేస్తున్నారా? అనే అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. అయితే 2024 ఎన్నికల్లో ఆ ప్రయత్నం వర్కౌట్ కాలేదు. మరి ఇప్పుడు ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. అసలు అందులో ఎంత వాస్తవం ఉందో కూడా తెలియాలి.

# విజయసాయిరెడ్డి పాదయాత్ర...



నెల్లూరు, జనవరి 27, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చాణక్యుడుగా పేరుగాంచిన విజయసాయి రెడ్డి మళ్లీ వార్తల్లో నిలిచారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు నంబర్ 2గా చక్రం తిప్పి, అనూహ్య పరిణామాల మధ్య ఆ పార్టీని వీడిన ఆయన, ఇప్పుడు తన సెకండ్ ఇన్నింగ్స్ కోసం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది రాజకీయాలకు గుడ్ బై చెప్పి వ్యవసాయం చేసుకుంటానన్న ఆయన, ఇప్పుడు రూటు మార్చి మళ్లీ రాజకీయ క్షేత్రంలోకి అడుగుపెడుతుండటం ఏపీ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. 2024 ఎన్నికల ఫలితాల అనంతరం వైసీపీలో వచ్చిన మార్పులు, అధినేత జగన్ మోహన్ రెడ్డితో పెరిగిన దూరం విజయసాయి రెడ్డిని తీవ్ర నిర్ణయం తీసుకునేలా చేశాయి. అప్పట్లో తన ఎంపీ పదవికి రాజీనామా చేసిన ఆయన, రాజకీయాలు తనకు ముగిసిన అధ్యాయమని ప్రకటించారు. అయితే, ఇటీవల ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో భాగంగా ఈడీ ఎదుట హాజరైన సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. "జూన్ తర్వాత రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అవుతాను.. మరిన్ని వివరాల కోసం ఈ నెలాఖరు వరకు వేచి ఉండండి" అని ఆయన చెప్పడం ద్వారా తన ఉద్దేశాన్ని స్పష్టం చేశారు.విజయసాయి రెడ్డి మళ్లీ వస్తున్నారంటే అది ఏ పార్టీ నుంచి అనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పై ఆయన చేసిన ఘాటు విమర్శల నేపథ్యంలో ఈ కూటమిలో ఆయనకు చోటు దక్కడం అసాధ్యం. జగన్ తో ఉన్న విభేదాలు, పార్టీలోని 'కోటరీ' వ్యవహారాల వల్ల మళ్లీ సొంత గూటికి చేరే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలో బీజేపీ అగ్రనేతలతో విజయసాయికి ఉన్న సత్సంబంధాల దృష్ట్యా ఆయన కమలం తీర్థం పుచ్చుకుంటారని కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది.కానీ, తాజా విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఆయన ప్రస్తుతానికి ఏ పార్టీలోనూ చేరడం లేదని తెలుస్తోంది. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును, బలాన్ని నిరూపించుకున్న తర్వాతే పార్టీ విషయంలో నిర్ణయం తీసుకోవాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. రాజకీయాల్లో తిరుగులేని ముద్ర వేయాలంటే ప్రజల్లోకి వెళ్లడమే ఏకైక మార్గమని విజయసాయి రెడ్డి విశ్వసిస్తున్నట్లు కనిపిస్తోంది. తన రాజకీయ గురువులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. ఇద్దరూ పాదయాత్రల ద్వారానే అధికార పీఠాన్ని అధిష్టించారు. అదే ఫార్ములాను ఇప్పుడు విజయసాయి కూడా ఎంచుకున్నట్లు సమాచారం. జూన్ నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టాలనేది ఆయన మాస్టర్ ప్లాన్ గా తెలుస్తోంది.పాదయాత్ర వెనుక విజయసాయి రెడ్డికి కొన్ని లక్ష్యాలున్నాయి. ప్రజల నాడిని పట్టుకోవడం ఇందులో ముఖ్యమైనది. క్షేత్రస్థాయిలో ప్రజలు ప్రస్తుత ప్రభుత్వంపై, వైసీపీపై ఏ అభిప్రాయంతో ఉన్నారో తెలుసుకోవాలని సాయిరెడ్డి భావిస్తున్నారట. ఏ పార్టీ అండ లేకుండా తానూ జనాన్ని ప్రభావితం చేయగలనని చాటి చెప్పడం కూడా పాదయాత్ర వెనుక మరో ఉద్దేశం. పాదయాత్రలో వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా కొత్త పార్టీ పెట్టాలా లేక బీజేపీ వంటి జాతీయ పార్టీలో చేరాలా అనే దానిపై నిర్ణయం తీసుకుంటారని ఆయన సన్నిహితులు చెప్తున్న మాట.విజయసాయి రెడ్డి పాదయాత్ర ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. ఒకవేళ ఆయన సొంతంగా పార్టీ పెడితే, అది వైసీపీ ఓటు బ్యాంకును చీల్చుతుందా? లేక కూటమి వ్యతిరేక ఓటును ఆకర్షిస్తుందా? అనేది ఆసక్తికరం. లిక్కర్ స్కామ్ వంటి కేసుల నీడలో ఆయన చేస్తున్న ఈ ప్రయాణం కేవలం రాజకీయ అస్తిత్వం కోసమేనా లేక చట్టపరమైన ఇబ్బందుల నుంచి రక్షణ కోసమా అనే కోణంలోనూ విశ్లేషణలు సాగుతున్నాయి.మొత్తానికి, వ్యవసాయం నుంచి మళ్లీ రాజకీయ వ్యవహారాల వైపు మళ్లుతున్న విజయసాయి రెడ్డి, జూన్ తర్వాత ఏపీ రాజకీయాల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తారో చూడాలి. పాదయాత్ర ఆయనకు రాజమార్గం అవుతుందో లేదో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

# 400 కోట్ల బ్లాక్ మనీ..

బెంగళూరు, జనవరి 27, కర్ణాటక–గోవా సరిహద్దులోని చోర్లా ఘాట్ అడవుల్లో గతేడాది అక్టోబరులో జరిగిన ఓ చోరీ ఘటన ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. గోవా నుంచి కర్ణాటక మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్న రెండు భారీ కంటైనర్లను గుర్తుతెలియని ముఠా అడ్డుకుని, అందులోని భారీ నగదును దోచుకెళ్లింది. శ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ దోపిడీ జరిగిన మూడు నెలల వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఇటీవల నాసిక్‌కు చెందిన సందీప్ పాటిల్ అనే వ్యక్తి తాను కిడ్నాప్‌కు గురయ్యానని, దోపిడీ గురించి తెలుసుకున్నందుకే తనను బంధించారని ఫిర్యాదు చేయడంతో ఈ మెగా ధూమ్ దోపిడి బయటపడింది.ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం ఎస్పీ స్థాయి అధికారినేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. తాజాగా బెల్గాం పోలీసులు కూడా ఈ విచారణలో చేరారు. మూడు రాష్ట్రాల పోలీసులు ఇప్పుడు ఆ మాయమైన కంటైనర్ల కోసం అడవులను జల్లెడ పడుతున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఒక హవాలా ఆపరేటర్‌తో సహా ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.ఈ దోపిడీ వెనుక కేవలం దొంగలే కాదు, కొందరు పోలీసు అధికారులు , ఒక ప్రముఖ మత గురువు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కంటైనర్లను అడ్డుకున్న ముఠాకు పోలీసులే సహకరించారని, అసలు బాధితుడు ఎవరో కూడా స్పష్టంగా తెలియకుండా జాగ్రత్త పడ్డారని తెలుస్తోంది. థానేకు చెందిన ఒక బిల్డర్‌కు చెందిన పాత నోట్లను మార్పిడి చేసే క్రమంలో ఈ దోపిడీ జరిగినట్లు సిట్ అనుమానిస్తోంది. అయితే బాధితుడు బయటకు వచ్చి ఫిర్యాదు చేయకపోవడం ఈ కేసులో అతిపెద్ద మిస్టరీగా మారింది.బెల్గాం పోలీసులు నాసిక్ వెళ్లి నిందితులను విచారించేందుకు అనుమతి కోరారు. అయితే, ఆ దోపిడీ నగదు నిజంగానే 400 కోట్లా లేక అంతకంటే ఎక్కు? అన్నది ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. సంఘటనా స్థలం మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో, నిందితులు ఎక్కడ నగదును దాచారనే దానిపై క్లూస్ కోసం సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకూ బయటకు వచ్చిన సమచారం చాలా తక్కువ. ఇంకా చాలా బయటకు రావాల్సి ఉంది. గుట్టుగా ముగిసిపోతుందా.. ప్రజలకు తెలిసేలా బయటపెడతారా అన్నది మాత్రం ఇంకా ఎవరికీ తెలియదు.

# ములుగు జిల్లామేడారం జాతర ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలి.

## మేడారంలో మీడియా సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

### నేటీ నుంచి మహాజాతర ప్రారంభం

### - జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి








**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా మేడారంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను పంచాయతీ రాజ్, క్ష్మ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. గద్దల ప్రాంగణం పక్కనే ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఈ మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరిస్తూ, మేడారం జాతరకు సంబంధించిన సమగ్ర సమాచారం ప్రింట్, ఎల(క్టానిక్ మీడియా ప్రతినిధుల ద్వారా ప్రజలకు సకాలంలో చేరేలా అన్ని సౌకర్యాలు ఈ మీడియా సెంటర్‌లో కల్పించినట్లు తెలిపారు. జాతర నిర్వహణ, భక్తుల రద్దీ, భద్రత, దర్శన ఏర్పాట్లు వంటి అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అత్యంత తక్కువ సమయంలో జాతర ఏర్పాట్లు పూర్తవడానికి అమ్మవారి దయే కారణమని పేర్కొన్నారు. మేడారం మహాజాతర సందర్భంగా భక్తులందరూ శాంతియుతంగా దర్శనం చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. రేపటి నుంచి మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే భారీ సంఖ్యలో భక్తులు మేడారం చేరుకుంటున్నారని తెలిపారు. జాతర నిర్వహణ కోసం అధికారులు రాత్రింబగళ్లు శ్రమించి పనిచేశారని మంత్రి ప్రశంసించారు. ఎక్కడైనా చిన్నచిన్న లోపాలు కనిపిస్తే భక్తులు క్షమించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అమ్మవారి దర్శనంతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి సమృద్ధి కలగాలని ఆమె అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సమాచార పౌర సంబంధర శాఖ అధికారులు డిప్యూటీ డైరెక్టర్ వై వెంకటేశ్వర్లు, ఖ ఎవఅన్ఘు ాబతీవంష్ట్ర, ఏడి లక్ష్మణ్ కుమార్, వసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కాళ్యాణి, మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

ఆత్మ గౌరవానికి ప్రతీకలుగా కొలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శు భాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణా కుంభమేళాగా పేరొందిన మేడారం మహా జాతరను వైభవంగా జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలతో నాలుగు రోజుల పాటు జరిగే పండుగను వన దేవతల మ త్సవంగా జరుపుకోవాలని అన్నారు. కోటిన్నరకు పైగా భక్తులు తరలి వచ్చే జాతరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఘనంగా ఏర్పాట్లు చేసిందని తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేలా మేడారం ఆలయాన్ని ప్రజా ప్రభుత్వం పునర్నిర్మించిందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. రూ. 250 కోట్లతో ఆలయ ప్రాకారం విస్తరణతో పాటు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజు గద్దెలను విశాలంగా నిర్మించామన్నారు. గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని ఆధునీకరించి, ప్రాంగణానికి నలు దిశలా తోరణాలను నిర్మించినట్లు గుర్తు చేశారు. లక్షలాదిగా నిరంతరం మేడారం తరలివస్తున్న భక్తులకు ఇబ్బంది లేకుండా రోడ్లు, శాశ్వత మౌలిక వసతుల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందన్నారు. గిరిజన సంస్క ృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు, ఆదివాసీల ఆచారాలను పరిరక్షణను ప్రభుత్వం బాధ్యతగా స్వీకరించిందని అన్నారు. మేడారం తల్లుల స్ఫూర్తితో జరిపిన ప్రజాస్వామ్య పోరాటం ఫలితంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని వనదేవతల దీవెనలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటి సారిగా తల్లుల చెంత ప్రజా ప్రభుత్వం రాష్ట్ర మంత్రి మండలి సమావేశం నిర్వహించిందని అన్నారు. జనంకోసం ప్రాణాలైనా ఇవ్వాలనే సందేశం ఇచ్చిన మేడారం సమ్మక్క, సారలమ్మ తల్లుల స్ఫూర్తిగా రా(ష్టాభివృద్ధికి పునరంకితమవుతామని అన్నారు. నాలుగు రోజుల పండుగను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కోటిన్నర మంది భక్తులు తరలివచ్చే అంచనాలు ఉండటంతో ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో పని చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అమెరికా నుంచి సీఎం ఫోన్ లో ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడారు. గిరిజనులు, ఆదివాసీలు, అన్ని రా(ష్టాల నుంచి వచ్చే భక్తులు అంతే భక్తి శ్రద్ధలతో వన దేవతలను దర్శనం చేసుకొని.. మొక్కులు చెల్లించుకోవాలని, జంపన్న వాగులో పుణ్య స్నానాలను ఆచరించాలని అన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకుండా భక్తులు సహకరించాలని కోరారు. పోలీసు విభాగంతో పాటు అన్ని విభాగాల అధికారులు కలిసికట్టుగా మహా జాతర వైభవంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాల అధికారులు నాలుగు రోజుల పాటు నిర్విరామంగా భక్తులకు అందుబాటులో ఉండాలని అప్రమత్తం చేశారు.

## ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

### కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజి(స్ట్రార్ కార్యాలయాలు

### నేడు పఠాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి శంకుస్థాపన

### మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ :- తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పదేళ్లలో ఆనాటి పాలకుల స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. గడచిన రెండేళ్లుగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం నాడు సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ .. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజి(స్ట్రార్ కార్యాలయాలను 11 క్లష్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహణాబాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని వివాహ రిజి(స్టేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్దులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్దులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన కార్యాలయాలకు శంకుస్థాపనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జూన్ 2వ తేదీ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పఠాన్ చెరువు-శంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కన(స్ట్రక్షన్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవనానికి బుధవారం నాడు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ రిజి(స్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, ఈ ఆధార్ సంతకం వంటి సౌకర్యాలతో ప్రజల సమయాన్ని ఎంతో ఆదా చేశామని అన్నారు. రెవెన్యూ శాఖలో తీసుకుంటున్న ఈ సంస్కరణలు కేవలం కార్యాలయాల మార్పు మాత్రమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్కరణలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన జర్నలిస్టు సంఘాలు రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమం, భద్రత, వృత్తి గౌరవాన్ని కాపాడేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల అక్రిడిటేషన్ అంశంపై అన్ని పాత్రికేయ సంఘాల సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని గతంలో విడుదల చేసిన జీవోలో మార్పులు చేర్పులు చేసి కొత్త జీవోను జారీ చేశామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. మంగళవారం నాడు సచివాలయంలో పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మంత్రిగారి కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోకుండా అందరికి న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు.



## ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ 93వ జయంతి సందర్భంగా జాగృతి నాయకులు నివాళ్ళు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైద్రాబాద్ జనవరి 27తెలంగాణ ఉద్యమకారులు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ 93వ జయంతి సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జాగృతి నాయకులు నివాళు ళ్ళ అర్పించారు. తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమాల్లో ఆయన పాత్రను స్మరించుకున్నారు.. కార్యాలయంలో జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ రూప్ సింగ్, సీనియర్ నాయకులు ఇస్మాయిల్, శ్రీకాంత్ రావు, అర్చనా సేనాపతి, శ్రీకాంత్ గౌడ్, లోక రవిచంద్ర, అనితా చౌదరి, నిట్టూరి రాజు తదితరులు పాల్గొన్నారు

## అమెజాన్‌లో భారీ లేఆఫ్స్.. 16,000 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం

హైదరాబాద్ జనవరి 27 : ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థల్లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించిన అమెజాన్.. ఇప్పుడు మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోందని సమాచారం. నేటి నుంచే ఉద్యోగుల్ని తొలగించబోతుంది. ఈసారి దాదాపు 16,000 మందిని తీసేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నేటి నుంచి వారం రోజుల్లోపు ఇందుకు సంబంధించి ఆదేశాలొచ్చే అవకాశం ఉంది. గత ఏడాది చివర్లో అమెజాన్ సంస్థ దాదాపు 14,000 మంది స్టాఫ్‌ను తొలగించింది. ఇప్పుడు మరో 16,000 మందిని తొలగించనుంది. అంటే ఆరు నెలల వ్యవధిలోనే దాదాపు 30,000 మందిని తొలగించినట్లవుతుంది. అంతకుముందు 2023లో 27,000 మందికి ఉద్వాసన పలికింది. ఏఐ, ఆటోమేషన్ కారణంగానే ఉద్యోగుల కోత జరుగుతోందని విశ్లేషకుల అంచనా. ఉద్యోగుల తొలగింపుపై మేనేజర్లు, సీనియర్ లీడర్లకు ఈ మేరకు ఇప్పటికే సమాచారం అందింది. పనితీరు ఆధారంగా కూడా లేఆఫ్స్ జరుగుతున్నాయని అమెజాన్ ఉద్యోగులకు తెలిపింది. అమెజాన్‌లో రిటైల్, వేర్‌హౌజ్ సిబ్బందితోపాటు హై శాలరీ కార్పొరేట్, అడ్మిని(స్టేషన్ ఉద్యోగుల్ని కూడా కంపెనీ తొలగిస్తోంది.

# ధరణి.. కథ ఇంతింత కాదయా..

హైదరాబాద్, జనవరి 27, బీఆర్ఎస్ హయాంలో తీసుకు వచ్చిన ధరణి పోర్టల్ భూకబ్జాలకు కేంద్రంగా మారిందని తెలంగాణ ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ నివేదిక సమర్పించినట్లుగా తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు తాజాగా ప్రభుత్వం నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలినట్లుగా తెలుస్తోంది. సిద్దిపేట, సిరిసిల్ల వంటి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ విచారణలో గ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని చెబుతున్నారు. రికార్డులు సరిగ్గా లేని భూములు, వివాదాస్పదమైన ఖరీదైన ఆస్తులను ఒక మాఫియాగా ఏర్పడి నిబంధనలకు విరుద్ధంగా తమ పేర్ల మీదకు మార్చుకున్నట్లు ప్రాథమిక నివేదిక స్పష్టం చేస్తోంది. అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు మరియు నిషిద్ధ జాబితా లో ఉన్న భూములను అత్యంత రహస్యంగా ధరణి రికార్డుల నుంచి తొలగించి, ప్రైవేటు వ్యక్తుల పేర్లపైకి మార్చినట్లుగా బయటపడిందని చెబుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి పరిధిలో సుమారు 15,000 ఎకరాల పైచిలుకు ప్రీమియం భూములు అక్రమాలకు గురైనట్లు లెక్కలు తేలాయని నివేదికలో ఉన్నట్లుగా తెలుస్తోంది. వీటి విలువ అక్షరాలా లక్ష కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. అర్ధరాత్రి వేళల్లో పోర్టల్ ఓపెన్ చేసి డేటాను మార్చడం, విదేశాల నుంచి సర్వర్లను ఆపరేట్ చేయడం వంటి తీవ్రమైన అంశాలను విచారణాధికారులు గుర్తించారు. ఇటీవల మీడియాలో వస్తున్న సత్యం స్కాం భూముల వ్యవహారం కూడా ఈ నివేదికలో కీలకంగా మారినట్లు తెలుస్తోంది. గతంలో వివాదాల్లో ఉండి, రిజిస్ట్రేషన్లకు వీలులేని భూములను ధరణిలోని మోడ్యూల్స్ మార్పుల ద్వారా బీఆర్ఎస్ పెద్దలకు అనుకూలంగా మార్చినట్లు ఆరోపణలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,848 ట్రాన్సాక్షన్లలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని నివేదికలో ప్రస్తావించినట్లుగా తెలుస్తోంది. ఈ నివేదికను ప్రభుత్వం పూర్తిస్థాయిలో బహిర్గతం చేస్తే, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అతిపెద్ద కుంభకోణాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఫోన్ ట్యాపింగ్ పేరుతో సీరియల్ ను నడుపుతున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు..తర్వాత ధరణి స్కాంలపై సీరియల్ నడిచే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో తెలంగాణలో పెద్ద ఎత్తున రాజకీయ దుమారాన్ని రేపడం ఖాయంగా కనిపిస్తోంది.

**ఆడిట్ కు రెడీ అవుతున్న ప్రభుత్వం**

ధరణి వ్యవస్థలో జరిగిన అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా మిగతా 31 జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. కేరళ కేంద్రంగా పనిచేసే సంస్థతో ఇప్పటికే.. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టింది తెలంగాణ ప్రభుత్వం. అయితే ఆ ఆడిట్ పూర్తైందని.. ఆ నివేదికను ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి చెప్పారు. కాగా, పేదలకు చెందిన ఇంచు భూమి కూడా అక్రమార్కులకు దక్కకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన సుమారు 5,500 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లు నిష్పక్షపాతంగా భూ సర్వేలు నిర్వహిస్తారని ఆయన చెప్పారు. కాగా, భూ భారతి స్కీమ్ కింద, రోవర్ టెక్నాలజీని ఉపయోగించి భూమి కొలతలు, సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. అందుకోసం సర్వేయర్లకు ఆధునికమైన రోవర్స్ సామగ్రి పంపిణీ చేస్తున్నామని మంత్రి చెప్పారు. నక్షా లేని 5 గ్రామాల్లో పైలట్ ఇప్పటికే సర్వే నిర్వహించామని, ఇందులో ఖమ్మం జిల్లాలోని ములుగుమాడు కూడా ఉందని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా నక్షాలులేని 413 గ్రామాల్లో మొదటి విడత సర్వే చేస్తామన్నారు. ఈ భూ సర్వేను విడతలవారీగా పూర్తిచేస్తామని.. భూముల మ్యాప్‌తో పాటు భూధార్ నంబర్లను అందించడంలో లైసెన్స్ సర్వేయర్లు ఉపయోగపడతారని మంత్రి పొంగులేటి తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించే అధికారం కలెక్టర్‌కు మాత్రమే పరిమితం చేయకుండా డీసెంట్రలైజ్డ్ చేశామన్నారు మంత్రి. ఇలా చేయడం వల్ల చాలా వరకు సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయని మంత్రి చెప్పారు. అయితే భూభారతి రిజిస్ట్రేషన్లలో భారీ కుంభకోణం జరిగిందనే ఆరోపణలను మంత్రి ఖండించారు. రూ. 1000 - రూ. 15000 కోట్ల స్కామ్ ఆరోపణలు అసత్యం అని చెప్పారు. ధరణి వ్యవస్థలో అవకతవకల కారణంగా రిజిస్ట్రేషన్ లో రూ. 3.90 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు గుర్తించామని మంత్రి పొంగులేటి చెప్పుకొచ్చారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి.. సొమ్ము రికవరీకి చర్యలు చేపట్టామని తెలిపారు.

# జీవన్ రెడ్డిని లైట్ తీసుకుంటున్న కాంగ్రెస్



కరీంనగర్ జనవరి 27, తెలంగాణ కాంగ్రెస్ లో కొత్త, పాత నేతల మధ్య వార్ ఊపందుకున్నట్లు కనిపిస్తుంది. అయితే మిగిలిన చోట్ల కొంత నేతలు కామ్ గా ఉన్నప్పటికీ సీనియర్ నేత జీవన్ రెడ్డి మాత్రం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి పెత్తనం చేసే వారిని ఉపేక్షించడానికి ఇష్టపడటం లేదు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యేగా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజీవ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన అప్పటి నుంచి తన అసంతృప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. అయినా రాష్ట్ర నాయకత్వం కానీ, కేంద్ర నాయకత్వం కానీ పట్టించుకోవడం లేదు. దీంతో ఇక సమయం వచ్చినప్పుడల్లా జీవన్ రెడ్డి తన అసహనాన్ని బహిరంగంగానే వెళ్లగక్కుతున్నారు. తాను రాజీ పడేది లేదని జీవన్ రెడ్డి కాంగ్రెస్ నేతలకు హెచ్చరికలు పంపుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడు జీవన్ రెడ్డి ప్రస్తుతం పార్టీ అధిష్టానం తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గాంధీ భవన్ వేదికగా ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కాంగ్రెస్ నాయకత్వ అహంపై దెబ్బకొడుతున్నాయి. ఒకప్పుడు రేవంత్ రెడ్డికి గట్టి మద్దతుదారుగా నిలిచిన జీవన్ రెడ్డి, నేడు అదే నాయకత్వం తనను విస్మరించడంపై భగ్గుమంటున్నారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన తన వంటి సీనియర్లను గౌరవించడంలో రాష్ట్ర నాయకత్వం విఫలమైందనే భావన ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి అసంతృప్తి మాత్రమే కాదు, పార్టీ అంతర్గత క్రమశిక్షణకు జరుగుతున్న పెద్ద డ్యామేజ్. జీవన్ రెడ్డి ఆగ్రహానికి ప్రధాన కారణం ఆయన సొంత నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు. జగిత్యాలలో ఆయన ఎవరిపైన దశాబ్దాలుగా పోరాటం చేశారో, అటువంటి నేతలను ఆయనకు కనీసం సమాచారం ఇవ్వకుండా పార్టీలో చేర్చుకోవడం జీవన్ రెడ్డి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసింది. ఫిరాయింపులను ప్రోత్సహించడమే కాకుండా, నియోజకవర్గంలో పాత శత్రువులకే పెత్తనం అప్పగించడం ఆయన రాజకీయ ఉనికిని ప్రశ్నార్థకం చేసింది. తన రాజకీయ ఆసక్తులను కాపాడాల్సిన బాధ్యత ఉన్న రాష్ట్ర నాయకత్వం, ఆయనను పక్కన పెట్టేయడం సీనియర్ నేతకు మింగుడుపడటం లేదు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల బాధ్యతలను కూడా తనకు ఇబ్బందికరంగా ఉన్న నేతలకే అప్పగించడం జీవన్ రెడ్డికి అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. పార్టీలో తనను ఒంటరిని చేస్తున్నారనే ఉద్దేశంతో, ఆయన ఇప్పుడు పార్టీకి ఎంత నష్టం చేయాలో అంతా బహిరంగంగానే చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కేడర్ అయోమయంలో పడటం, సీనియర్ నేతలే రోడ్డెక్కడం ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చుతోంది. జీవన్ రెడ్డి వంటి కీలక నేతను బుజ్జగించడంలో, తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో కాంగ్రెస్ విఫలమవుతోంది. సీనియర్ల అనుభవాన్ని ఉపయోగించుకోకపోగా, వారిని కించపరిచేలా వ్యవహరించడం వల్ల పార్టీకి దీర్ఘకాలికంగా నష్టం జరిగే అవకాశం ఉంది. జీజీవన్ రెడ్డి అసంతృప్తిని తగ్గించకపోతే జగిత్యాలకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పార్టీపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని కొంత మంది సీనియర్లు అంటున్నారు. జీవన్ రెడ్డి తరచూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వంపైన కూడా విరుచుకుపడుతున్నారు. నిజమైన కాంగ్రెస్ నేతలను పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దూరం పెట్టారని, ఇది భవిష్యత్ లో పార్టీ ఎదుగుదలకు మంచిది కాదని చెబుతున్నారు. తాజాగా ఆయన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కూడా బహిష్కరించి వెళ్లిపోయారు. ఆ సమావేశానికి ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ ను ఆహ్వానించడమే పెద్దాయన కోపానికి కారణం. దీంతో జీవన్ రెడ్డి తాను అనుకున్నది మీడియా ముందు కక్కేసి బయటకు వెళ్లిపోయారు. నిజానికి జీవన్ రెడ్డికి సీనియర్ నేతగా పార్టీ అన్యాయం చేసిందనే చెప్పాలి. పార్టీ కష్టకాలంలో జెండా వదలకుండా అట్టిపెట్టుకుని బీఆర్ఎస్ పై పోరాటం చేసిన జీవన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పదవిలేకుండానే ఇప్పటి వరకూ గడిపారు. ఇక వేచి చూసి లాభం లేదని భావించిన పెద్దాయన వాయిస్ పెంచినట్లు కనపడుతుంది. దీర్ఘకాలంగా, పార్టీ అధికారంలో లేనప్పుడు కూడా కాంగ్రెస్ జెండాను వదలకుండా పోరాడిన జీవన్ రెడ్డిని పక్కన పెట్టడంపై ఆయన వర్గం సీరియస్ గా ఉంది. కొన్ని దశాబ్దాలుగా ఆయన కాంగ్రెస్ లో కీలక నేతగా కొనసాగుతున్నారు. దాదాపు నలభై ఏళ్ల నుంచి ఆయన రాజకీయాల్లో ఉన్నారు. తొలుత టీడీపీ నుంచి ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమయినా తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయన కొనసాగుతున్నారు. జీవన్ రెడ్డి ఇక తాడో పేడో తేల్చుకోవడానికే సిద్ధమయినట్లు కనిపిస్తుంది. ఆయన ఇక కీలక నిర్ణయం తీసుకునే అవకాశముందని పరా?టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. మరి జీవన్ రెడ్డిని బుజ్జగించే వారు కూడా ప్రస్తుతం రాష్ట్ర నాయకత్వంలో లేకపోవడంతో ఆయనకు ఢిల్లీ హైకమాండ్ పిలిచి హామీ ఇస్తేనే కాస్త శాంతించే అవకాశముంది. లేకుంటే మాత్రం కాంగ్రెస్ కు నష్టమే.

# కేబినెట్ లో కోల్డ్ వార్

## భట్టి వర్సెస్ కోమటిరెడ్డి



హైదరాబాద్, జనవరి 27, తెలంగాణలో సింగరేణి నైనీ బ్లాక్ టెండర్ల వ్యవహారం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసింది. ఈ వ్యవహారం కేవలం ఒక టెండర్ రద్దుకు పరిమితం కాకుండా, ప్రభుత్వంలోని అంతర్గత కుమ్ములాటలను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాలను ఎత్తిచూపుతోంది. ఒక మీడియా సంస్థ బయటపెట్టిన ఈ డొల్లతనం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ తవ్వకాలకు సంబంధించి పిలిచిన టెండర్లలో సైట్ విజిట్ అనే నిబంధనను చేర్చడం వెనుక పెద్ద వ్యూహమే ఉందనేది తాజా ఆరోపణల సారాంశం. సాధారణంగా ఇలాంటి టెండర్లలో పారదర్శకత కోసం పోటీని ప్రోత్సహిస్తారు. కానీ, ఈ నిబంధన వల్ల ఒక ప్రముఖ మీడియా సంస్థ అధిపతికి చెందిన కంపెనీకి మాత్రమే లబ్ధి చేకూర్చేలా నిబంధనలు రూపొందించారనే వార్తలు గుప్పుమన్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఇంధన శాఖ పరిధిలో జరిగిన ఈ ప్రక్రియపై విమర్శలు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. టెండర్లు రద్దు చేస్తూ భట్టి విక్రమార్క ప్రకటన చేసినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రభుత్వ పారదర్శకతపై మచ్చ పడింది. వాస్తవానికి సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కంపెనీకి టెండర్ దక్కకుండా చేసేందుకే భట్టి విక్రమార్క ఈ నిబంధన తెరపైకి తెచ్చారనేది ఆరోపణ. అంటే రేవంత్ కేబినెట్ లోని ఇద్దరు మంత్రుల మధ్య ఆధిపత్యపోరుకు ఇది నిదర్శనం. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరించిన తీరు రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తన కేబినెట్ మంత్రుల మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించాల్సింది పోయి, రేవంత్ రెడ్డి దీనిని రెండు మీడియా సంస్థల వార్ గా అభివర్ణించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. రెండు మీడియా హౌజ్‌ల గొడవలోకి మమ్మల్ని లాగొద్దు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తికి తగవనే విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి, ఇది మీడియా సంస్థల మధ్య గొడవ కాదు. తన కేబినెట్ లోని నెంబర్ 2 స్థానంలో ఉన్న మంత్రి తీసుకున్న నిర్ణయం తప్పు అని తెలిసినప్పుడు ముఖ్యమంత్రిగా జోక్యం చేసుకుని సరిదిద్దాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిపైన ఉంటుంది. కేబినెట్ లో ఇద్దరి మధ్య వివాదం రేగినప్పుడు, ఇద్దరినీ కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించాలి. కానీ ఆ పని చేయడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని స్పష్టమవుతోంది. నైనీ బ్లాక్ ఇష్యూలో ప్రభుత్వం ఇరకాటంలో పడడంతో, ప్రజల దృష్టిని మళ్లించడానికి పాత కేసులను తెరపైకి తెస్తున్నారనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ ఇష్యూను మళ్ళీ చర్చల్లోకి తీసుకురావడం ద్వారా నైనీ బ్లాక్ వివాదాన్ని అణచివేసే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇది సమస్యను పరిష్కరించడం కాకుండా, కేవలం డ్యామేజ్ కంట్రోల్ కోసం చేస్తున్న రాజకీయ విన్యాసంగా కనిపిస్తోంది. నైనీ బ్లాక్ వ్యవహారం రేవంత్ రెడ్డి టీమ్‌లోని గందరగోళాన్ని బహిర్గతం చేసింది. కేబినెట్ లోని ఆధిపత్య పోరును సకాలంలో సర్దుబాటు చేయకపోవడం వల్లే ఇది ఇంతటి వివాదానికి దారితీసింది. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మీడియా చాటున దాక్కోకుండా, పాలనలో పారదర్శకతను, మంత్రుల మధ్య ఐక్యతను నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే డొల్లతనం అనే ముద్ర ప్రభుత్వానికి శాశ్వతంగా పడిపోయే ప్రమాదం ఉంది.

# మేడారంలో బస్ స్టాండ్

వరంగల్, జనవరి 27, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర భక్తుల కోసం రవాణా శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ములుగు జిల్లా మేడారంలో శాశ్వత బస్టాండ్ నిర్మిస్తామని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ప్రకటించారు. జాతర కోసం ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో 50 ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు.

భక్తుల రద్దీని తట్టుకునేందుకు 4 వేల ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తెచ్చారు, ఇవి ప్రయాణికులను నేరుగా గద్దెల సమీపం వరకు తీసుకెళ్తాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం మేడారం బస్సులకు కూడా వర్తిస్తుంది. అదనంగా.. ములుగులో రూ.5 కోట్లతో బస్టాండ్, ఏటూరునాగారంలో రూ.7 కోట్లతో బస్ డిపో నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం రవాణా శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ములుగు జిల్లా మేడారంలో పర్యటించిన రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ , పంచాయతీరాజ్ మంత్రి సీతక్క వనదేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల రవాణా సౌకర్యాల కోసం ఆర్టీసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌ను వారు ప్రారంభించారు. మేడారం జాతర సమయంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ ప్రతి ఏటా తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేస్తోంది. అయితే.. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మేడారంలో శాశ్వత బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జాతర కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌లో భక్తుల సౌకర్యార్థం 50 ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. దీనివల్ల ప్రయాణికులు తోపులాట లేకుండా క్రమపద్ధతిలో బస్సుల కోసం వేచి ఉండవచ్చు. ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే జాతర కోసం ప్రాథమికంగా 4 వేల బస్సులను కేటాయించారు. భక్తుల రద్దీ పెరిగితే ఈ సంఖ్యను మరింత పెంచుతామని మంత్రి తెలిపారు. సాధారణంగా జాతర సమయంలో వాహనాలను దూరంగా నిలిపివేస్తారు.. కానీ ఆర్టీసీ బస్సులను మాత్రం భక్తుల సౌకర్యార్థం గద్దెల సమీపం వరకు అనుమతిస్తారు. మేడారం పరిసర ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేయడానికి ములుగులో రూ. 5 కోట్లతో అత్యాధునిక బస్టాండ్‌ను, ఏటూరునాగారంలో రూ. 7 కోట్లతో కొత్త బస్‌డిపోను నిర్మిస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మేడారం జాతరకు వచ్చే మహిళా భక్తులకు కూడా వర్తిస్తుంది. అంటే మహిళలు ఉచితంగా బస్సుల్లో మేడారం చేరుకోవచ్చు. మరోవైపు.. మేడారంలో భక్తులు అమ్మవార్లకు సమర్పించే బెల్లం (బంగారం) విషయంలో కొన్ని ఆంక్షలు అమలులో ఉన్నాయి. గుడుంబా తయారీకి బెల్లం తరలిపోకుండా ఉండాలని ఎక్సైజ్ అధికారులు ఆధార్ కార్డు వివరాలు అడుగుతున్నారు.

దీనివల్ల కొన్ని చోట్ల భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత శనివారం ఒక్కరోజే సుమారు 2 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకోవడం జాతర విశిష్టతను చాటుతోంది. ములుగులోని గిరిజన విశ్వవిద్యాలయం ఈ జాతరపై సమగ్ర పరిశోధన చేయాలని నిర్ణయించింది.

# మహాశివరాత్రికి అట్టహాసంగా ఏర్పాట్లు కేఎల్ఆర్

## శ్రీ శివగంగా రాజరాజేశ్వరి ఆలయ ఏర్పాట్లు పరిశీలన

## అభివృద్ధి పనులకు నిధులకు కొరత లేకుండా చూస్తాం

## భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి: ఛైర్మన్ తో లక్ష్మారెడ్డి

రంగారెడ్డి మహేశ్వరం పట్టణంలోని శ్రీ శివగంగా రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సందర్శించారు. త్వరలో జరగనున్న బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ప్రభుత్వం తరపున పరిశీలించారు.

ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలె కుమార్ ఆధ్వర్యంలో ఆలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణం సహా ఇతర నిర్మాణాలు చకచకా జరుగుతున్నాయని కేఎల్ఆర్ కొనియాడారు. ఆలయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎస్డీఎఫ్ , దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి నిధులను కిచ్చెన్నగారి సహకరంతో వచ్చాయని ఆలయ ఛైర్మన్ ఆలె కుమార్ తెలిపారు. మహాశివరాత్రి, బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకల ఏర్పాట్లు చేయాలని లక్ష్మారెడ్డి పలు సూచనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉండే అయ్యప్ప భక్తులకు కొత్త సన్నదానం కట్టుకునేందుకు సహకరిస్తానని కేఎల్ఆర్ హామీ ఇచ్చారు. శ్రీ శివగంగా రాజరాజేశ్వరి ఆలయంతో పాటు అక్కన్న- మాదన్న ప్రాంగణాలను తిర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం పట్టణ కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అంత పెద్ద శిక్షా..

## ఆవేదనలో ఖమ్మం టీచర్

ఖమ్మం, జనవరి 27, ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెం ప్రభుత్వ పాఠశాల ఇంగ్లీష్ టీచర్ గౌతమి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వ్యవహారం వివాదాస్పదమైంది. పాఠశాల పనివేళల్లో పాఠాలు చెప్పకుండా.. ప్రైవేటు సంస్థల బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ వీడియోలు తీసినందుకు అధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. ఈ చర్యపై గౌతమి తీవ్ర భావోద్వేగానికి లోనవుతూ మరో వీడియో విడుదల చేశారు. 'నేనేమీ గంజాయి అమ్మలేదు, ఎవరినీ చంపలేదు.. తెలియక చేసిన తప్పుకు ఇంతలా ట్రోలింగ్ చేస్తారా?" అంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఆత్మహత్య చేసుకోవాలన్నంత బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠినంగా ఉంటామని అధికారులు హెచ్చరించగా.. బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సోషల్ మీడియా మోజులో పడటం సరికాదని నెటిజన్లుఅభిప్రాయపడుతున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాల గదిని సోషల్ మీడియా వేదికగా మార్చుకున్నారనే ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయురాలు గౌతమి వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే కారణంతో విద్యాశాఖ అధికారుల నుంచి కఠిన చర్యలు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నవారు ఎలాంటి ప్రైవేటు వ్యాపార ప్రకటనల్లో నటించకూడదు. కానీ.. గౌతమి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పలు ప్రైవేటు విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ రీల్స్ చేశారనే ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా పాఠశాల పని వేళల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా సోషల్ మీడియా పనుల్లో నిమగ్నమవ్వడంపై ఉన్నతాధికారులు గతంలోనే ఆమెను హెచ్చరించారు. అయినప్పటికీ ఆమె తీరులో మార్పు రాకపోవడంతో.. విధి నిర్వహణలో క్రమశిక్షణారాహిత్యం కింద ఆమెను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ వార్త బయటకు వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న విపరీతమైన ట్రోలింగ్‌పై గౌతమి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాజాగా ఆమె మరో వీడియో విడుదల చేస్తూ తన గోడు వెళ్లబోసుకున్నారు. 'నేనేమైనా గంజాయి విక్రయించానా..? లేక ఎవరినైనా హత్య చేశానా..? కేవలం తెలియక చేసిన చిన్న తప్పుకే నన్ను ఇంతలా అవమానిస్తారా..? అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తనపై వస్తున్న విమర్శలను తట్టుకోలేకపోతున్నానని.. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన తప్పును క్షమించి తనకు మరో అవకాశం ఇవ్వాలని ఆమె అధికారులను వేడుకున్నారు. ఈ ఘటనపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ విధులను గాలికి వదిలేయడం తప్పని కొందరు అంటుంటే.. ఆమె ఆవేదనను గమనించి మానవతా దృక్పథంతో క్షమించాలని మరికొందరు కోరుతున్నారు. ఏదేమైనా.. విద్యావ్యవస్థలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు సామాజిక మాధ్యమాల వినియోగంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఘటన ఒక పాఠంగా నిలిచింది.

# కవితను కంట్రోల్ చేయడం ఎలా



అదిలాబాద్, జనవరి 27, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ కు పంటి కింద రాయిలా మారారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేసే విమర్శలకు కవిత కౌంటర్ ఇస్తున్నట్లు కనపడుతుంది. ముందుగా బీఆర్ఎస్ లో జరిగిన అవినీతిని బయటపెడుతూ కారు పార్టీని ఇరుకునపెట్టేలా ప్రయత్నిస్తున్నారు. ఏ విషయంలోనైనా సరే కవిత తన తండ్రి స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ అని ఏ మాత్రం మొహమాటానికి పోవడం లేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక అవినీతి పనులు జరిగాయని సాక్షాత్తూ కవిత చేస్తున్న ఆరోపణలకు బీఆర్ఎస్ నుంచి సరైన సమాధానమే రావడం లేదు. కవితను ఎంతగా పట్టించుకోకుండా వదిలేయాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నప్పటికీ ఆమె చేసే ఆరోపణలు మాత్రం పార్టీని డ్యామేజీ చేస్తున్నాయని చెప్పక తప్పదు.తాజాగా సింగరేణి కాంట్రాక్టులపై కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు కూడా బీఆర్ఎస్ ను ఇరుకున పెట్టాయి. మేఘా అనే తిమింగలాన్ని రక్షించేందుకు బీఆర్ఎస్ చిన్న చేప చుట్టూ టెండర్ల వ్యవహారాన్ని తిప్పుతోందనితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కార్మికులకు కష్టం వస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పట్టించుకోవటం లేదని, పెద్ద కాంట్రాక్టర్ ను కాపాడేందుకు గుంటనక్క ప్రయత్నం చేస్తోందన్నారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్ తప్పులే చేయనట్లు మాట్లాడటం విచిత్రంగా ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు. . గత బీఆర్ఎస్ ప్రభుత్వం లోనే సృజన్ రెడ్డికి సింగరేణి కాంట్రాక్ట్ లు ఇచ్చారని, అప్పుడు రేవంత్ రెడ్డి బావమరది అని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్ చేసిన విమర్శలకు విలువ లేకుండా పోతుంది.కవిత లక్ష్యం హరీశ్ రావు, సంతోష్ రావులు కావచ్చు. తన తండ్రి కేసీఆర్ కు రాసిన బహిరంగ లేఖ బయటకు రావడానికి వారే కారణమని భావించడంతో పాటు తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంలో వీరి ప్రమేయం ఉందని గట్టిగా నమ్ముతున్న కవిత వారిని వదిలిపెట్టేలా కనిపించడం లేదు. కవిత విమర్శలు ఏ మాత్రం ప్రభావం చూపవని అనుకోవడం తప్పే అవుతుంది. కేసీఆర్ కుమార్తెగా ఆమె బీఆర్ఎస్ చేసే ఆరోపణలపై చాలా ప్రభావం ఉంటుందని నేతలు ఇప్పటికే భయపడిపోతున్నారు. కవితను కంట్రోల్ చేయడానికి కేసీఆర్ ఇప్పటి వరకూ ప్రయత్నం చేయకపోవడంతో ఇక రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సయితం బీఆర్ఎస్ కు నష్టం చేకూరుతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

# చేతకాని/సిగ్గుమాలిన ప్రభుత్వ తప్పిదాలతో జనం అవస్థలు..



కడప 20 నెలలు గా కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యర్రముక్కపల్లె - బాకరాపేట రైల్వే బ్రిడ్జి రోడ్డు పనులు పెండింగ్ లో పడటం, ఏళ్ల తరబడి జనం తీవ్ర అవస్థలు పడటం దారుణమని, పెండింగ్ పనులను వెంటనే పరిపూర్తి చేయాలని సిపిఐ నగర కార్యదర్శి యన్ వెంకట శివ డిమాండ్ చేశారు.మంగళవారం కడప నగర సౌత్ జోన్,18 వ డివిజన్ జెవి నగర్ లో సిపిఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించి రైల్ గేమ్ రైల్వే బ్రిడ్జి వరకు స్థానికులచే సంతకాల సేకరణ చేపట్టారు. మాజీ కౌన్సిలర్, సిపిఐ సీనియర్ నాయకులు, ఐకాన్ విల్లాస్ వాసి పాలెం చెన్నకేశవరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు కిన్నెర నాగముని నగర్ వాస్తవ్యులు కిన్నెర నాగరాజు లు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వెంకట శివ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు అయితే , స్థానిక నేతలు అది వద్దని రైల్వే అండర్ బ్రిడ్జి కి అనుమతులు తీసుకొని రైల్వే టెండర్లు పిలిపించుకొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కడప, కమలాపురం ఎమ్మెల్యేలు అట్టహాసంగా ప్రారంభించిన రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ఎర్రముక్కపల్లి వైపు పూర్తయినా గాని, భాకరాపేట వైపు పనులు పూర్తి కాకపోవడం, ఇప్పటికీ అసలు భూ సేకరణ నే జరపకపోవడం దారుణమన్నారు. ఏళ్ల తరబడి సంబంధిత ప్రాంతాల ప్రజానికం రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నప్పటికీ జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సకాలంలో రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు పనుల పరిపూర్తికి చిత్తశుద్ధితో కృషి చేయకపోవడం దారుణమన్నారు. నాడు లక్షల రూపాయలతో టిడిఆర్ బాండ్లు, నగదు తో ఇల్లులు కోల్పోతున్న బాధితులకు రాష్ట్ర పరిహారం చెల్లిస్తామన్నారు. నెల క్రితం భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసి,కోట్ల రూపాయలతో భూ సేకరణకు అడ్డగోలుగా అధికార యంత్రాంగం వ్యవహరించేందుకు సిద్ధమవుతుండడం దారుణమన్నారు. భూసేకరణలో అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఇల్లు కోల్పోతున్న వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించి రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు పనులను నిర్దిష్ట కాలపరిమితితో పరిపూర్తి చేసి ప్రజల రాకపోకల కష్టాల కడగండ్లను తీర్చాలని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ కడప నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, లోకసత్తా శ్రీకృష్ణ, ఈస్ట్ జోన్ సిపిఐ కార్యదర్శి పగడపూల మల్లికార్జున, వడ్ల భాగ్యలక్ష్మి, దగ్గుబాటి శీను, రాపూరి మధు తదితర సిపిఐ నాయకులు సంతకాలు సేకరించారు. సంతకాలు చేసినవారిలో రైల్వే అండర్ బ్రిడ్జి గుండా రాకపోకలు సాగిస్తున్న 16, 17, 18 డివిజన్ల కు సంబంధించిన అన్ని రాజకీయ పక్షాల , ప్రజా సంఘాల నేతలు, ఉద్యోగస్తులు , స్థానికులు తదితరులు సంతకాలు చేసిన వారిలో ఉన్నారు.

## మంథని మున్సిపల్ బరిలో జనసేన

## -అన్ని వార్డుల్లో పోటీ చేస్తాం

## -జనసేన మంథని నియోజకవర్గ ఇన్చార్జి మాయ రమేష్




**ప్రజాబలం ప్రతినిధి:** మంథని మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలో ఉంటుందని మంథని నియోజకవర్గ ఇన్చార్జి మాయ రమేష్ స్పష్టం చేశారు. మంగళవారం మంథని పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో జనసేన ఇన్చార్జి మాయ రమేష్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మంథని మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల నుండి పోటీ చేస్తున్నామని ఆయన వివరించారు. తెలంగాణ అంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు ఎనలేని అభిమానమని అన్నారు. జనసేనాని ఇష్టదైవమైన కొండగట్టు అంజన్న ఇచ్చిన ధైర్యంతో మంథని మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి తీరుతామని ఆయన తెలిపారు. త్వరలోనే విధివిధానాలను ప్రకటిస్తామని ఆయన ఖరారు చేశారు. జనసేన పార్టీకి అధికార చిహ్నమైన గాజు గ్లాసు గుర్తు ఉందని, అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు ఎన్నికల్లో ముందుకు వెళ్తామని ఆయన వివరించారు. పార్టీ అభ్యర్థుల పేర్లు పరిశీలనలో ఉన్నాయని, పలు పార్టీల నుండి ఆశావాహులు జనసేన నుండి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. పార్టీల్లో కొనసాగుతున్న సీనియర్లకు అవకాశం కల్పిస్తామని, కచ్చితంగా మంథని మున్సిపల్ ఎన్నికల్లో జనసేన విజయం సాధించడానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మండల పార్టీ అధ్యక్షుడు బూడిద అనిల్, ముత్తారం పార్టీ అధ్యక్షుడు సట్ల సతీష్, జనసేన నాయకురాలు అంజలి, పార్టీ యువ నాయకులు గాజుల హరీష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు ప్రక్షాళనకు మంత్రి నారాయణ 'మాస్టర్ ప్లాన్'

**అడ్డుకుంటే ఖబడ్దార్ అని ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ స్ట్రాంగ్ కౌంటర్!**

**నెల్లూరు అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర క్షమించదు: ప్రతిపక్ష డ్రామాలను ఎండగట్టిన ఇంచార్జ్ మేయర్×**

**మీ కాలేజీల ముందు బంకులు పెడితే ఊరుకుంటారా?**

**- ఎమ్మెల్సీకి మేయర్ రూప్ కుమార్ యాదవ్ సూటి ప్రశ్న**

**బంకుల యజమానులను అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తారా?**

**- ఎమ్మెల్సీ తీరుపై ఇంచార్జి మేయర్ ఫైర్**

**వరద ముప్పు లేని నెల్లూరు కోసం 50 కోట్లతో జరుగుతున్న కాలువల ఆధునికీకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఇంచార్జి మేయర్ .**

నెల్లూరు నగరాన్ని ఒక మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ అభివృద్ధి ప్రస్థానాన్ని పరుగులు తీయిస్తున్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కునారిల్లిన నగర వ్యవస్థలను చక్కదిద్దుతూ, భవిష్యత్తులో వరద ముప్పు అనేదే లేకుండా చేసేందుకు భారీ మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న పనులను ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు .ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధిని అడ్డుకుంటున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు.నెల్లూరు నగరంపై మంత్రి నారాయణకి ఉన్న ప్రత్యేక మమకారంతోముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఒప్పించి 50 కోట్ల రూపాయల ప్రత్యేక నిధులను మంజూరు చేయించారన్నారు .నగరం గుండా ప్రవహించే 12 ప్రధాన కాలువలను శాశ్వతంగా ప్రక్షాళన చేయాలని ఆయన సంకల్పించారనీ తెలిపారు .మంత్రి ఆదేశాల మేరకు అధికారులతో కలిసి రామరెడ్డి కాలువ (70 లక్షలు), ఎల్లీ కాలువ (1.50 కోట్లు) పనులను స్వయంగా పరిశీలించానన్నారు. క్వాలిటీతో, నిర్ణీత సమయంలో పనులు పూర్తి కావాలని మంత్రి కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి ఘాటు కౌంటర్

అభివృద్ధికి అడ్డుపడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్ కౌంటర్ అటాక్ ఇచ్చారు. "అయ్యా చంద్రశేఖర్ రెడ్డి గారు.. మీకు అనేక విద్యాసంస్థలు ఉన్నాయి కదా రేపు ఉదయం మీ కాలేజీల ముందు నేను నాలుగు బంకులు పెట్టిస్తే మీరు ఒప్పుకుంటారా?" అంటూ సూటిగా ప్రశ్నించారు.పదో తరగతి చదువుకునే ఆడపిల్లలు వెళ్లే స్కూల్ ప్రహరీ గోడ పక్కన బంకుల సాకుతో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించడం ఏంటని ప్రశ్నించారు. హైకోర్టు నిబంధనల ప్రకారం స్కూల్ పరిసరాల్లో ఇలాంటివి ఉండకూడదని తెలిసినా, రాజకీయం కోసం మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు.మంత్రి నారాయణ 15 కోట్ల సొంత నిధులతో స్కూల్‌ను డెవలప్ చేస్తుంటే, ఓర్వలేక చంద్రశేఖర్ రెడ్డి అడ్డుపడుతున్నారని.. బంకుల యజమానులకు తాము న్యాయం చేస్తామని, మధ్యలో ఎమ్మెల్సీ డ్రామాలు కట్టిపెట్టాలని హెచ్చరించారు.నెల్లూరు నగర ప్రయోజనాలే పరమావధిగా మంత్రి నారాయణ ముందుకు సాగుతున్నారని, ఇలాంటి ఎన్ని రాజకీయ అడ్డంకులు వచ్చినా నగరాభివృద్ధి ఆగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# గుంపు మేస్త్రికీ ప్రధాన గూఢచారియే సంతోష్ రావు

# ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి వెపన్స్ ఇవ్వాలి కవిత



హైదరాబాద్ నిజామాబాద్ లో గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. సౌమ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కవిత మాట్లాడుతూ గుంపు మేస్త్రికీ ప్రధాన గూఢచారియే సంతోష్ రావు. కేసీఆర్ తినే ఇడ్లి సమాచారాన్ని కూడా రేవంత్ రెడ్డికి చేరవేసే వ్యక్తే ఆయన. తన గూఢచారికి శిక్షపడకుండా రేవంత్ రెడ్డి కాపాడుకునే పరిస్థితి ఉందని అన్నారు.

కేసీఆర్ కు ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను దూరం చేసిన దుర్మార్గుడు. పోలీసులు నిజాయితీగా పనిచేస్తే సంతోష్ రావు కు కచ్చితంగా శిక్ష పడుతుంది. నేను చెప్పిన దయ్యాల్లో మొదటి దెయ్యం సంతోష్ రావే. ఆయనకు హరీష్ రావు, కేటీఆర్ లు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావటం లేదు. గంజాయి, డ్రగ్స్ ముఠాలకు తగిన గుణపాఠం చెప్పాలి. సౌమ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తున్నా. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు దూరం కావటానికి కారణం సంతోష్ రావు. గద్దర్ లాంటి నాయకులు గంటలు గంటలు గేట్ బయట వేచి చూడటం, ఈటల లాంటి వారు బయటకు రావటానికి కూడా ఈ సంతోష్ రావే కారణమని ఆరోపించారు.

సంతోష్ రావు ను సిట్ పిలవటం మంచిదే. కానీ ఆయనకు శిక్ష పడటం అనుమానమే. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పోలీసులు తమ పని తాము చేయాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా. ఒక్కోసారి మన నీడ కూడా మన కళ్లను కప్పే పరిస్థితి వస్తుంది. ఉద్యమకారులను కేసీఆర్ కి దూరం చేసిన పాపం కచ్చితంగా ఈ దుర్మార్గుడికి తగులుతుందని అన్నారు.

నిజామాబాద్ కు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి కొంచెం క్రిటికల్ గా ఉన్నప్పటికీ కాస్త ఇంప్రూమెంట్ ఉంది. ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్ ను చంపే ధైర్యం గంజాయి బ్యాచ్ చేసిందంటే ప్రభుత్వం అంటే వారికి ఏ మాత్రం భయం లేదని స్పష్టమవుతోంది. డ్రగ్స్, గంజాయి ఫ్రీ చేస్తామని ఈ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ దురదుష్టమేమిటంటే గ్రామాల్లో కూడా ఫ్రీ గా గంజాయి, డ్రగ్స్ దొరికే పరిస్థితి వచ్చింది. స్కూల్ లోకి కూడా గంజాయి, డ్రగ్స్ తీసుకొచ్చి పిల్లలను పాడు చేస్తున్నారు. దీని కారణంగా మా ఆడవాళ్లే బాధితులుగా మారే పరిస్థితి ఉంటుంది. గృహహింస ఘటనలు జరగటానికి డ్రగ్స్, గంజాయి కారణమవుతోంది. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మత్తు వదిలి డ్రగ్స్, గంజాయి మాఫియా పై వారి ప్రతాపం చూపాలి. అదే విధంగా ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి వెపన్స్ ఇవ్వాలి. వాళ్లకు ట్రైనింగ్ లో గన్ ఫైరింగ్ ఉంటుంది. కానీ వెపన్స్ ఇవ్వటం లేదని అన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎంపి చిన్ని


విజయవాడ తూర్పు నియోజకవర్గం 4వ డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో రోడు నిర్మాణ పనులకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేసారు. ×రూ.13 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం జరిగింది.

ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ రోజుకి యువనేత మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించి మూడేళ్లు అవుతుంది. యువగళం పాదయాత్రతో నారా లోకేష్ రాష్ట్రాన్ని రాక్షస పాలన నుంచి విముక్తి కలిగించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పాదయాత్ర ద్వారా తెలుసుకున్న ప్రజల సమస్యల పరిష్కరించటానికి నిరంతరం కృషి చేస్తున్నారు. నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న మంత్రినారా లోకేష్ కు విజయవాడ ప్రజల తరుపున ధన్యవాదాలు. రాక్షస పాలన రాష్ట్రంలో పోయింది కానీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లో పోలేదు. విజయవాడ అభివృద్ధికి సంబంధించిన డి.పి.ఆర్ లను మున్సిపల్ కౌన్సిల్ రిజెక్ట్ చేసింది. విజయవాడ అబివృద్ధికి విజయవాడ మున్సిపల్ కౌన్సిల్ అడ్డుగా నిలబడుతోంది. ఈ నెల 31వ తేదీ లోపు డ్రింకింగ్ వాటర్, స్టామ్ వాటర్, డ్రైనేజీ అభివృద్ధికి సంబంధించిన డిపిఆర్ మా చేతికి అందనుంది. డిపిఆర్ రాగానే విజయవాడ నగరంలో నెలకొన్న పెద్ద సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తాం. రాణి గారి తోట వద్ద ఒక అండర్ పాస్ కి టెండర్ వేయటం జరిగింది.

కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో విజయవాడకి సంబంధించిన నేషనల్ హైవేస్, రైల్వే సమస్యలు ఒక కొలిక్కి వస్తాయి. విజయవాడ అభివృద్ధికి డిపిఆర్ సిద్ధం కాగానే ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబు ను కలిసి మూడు వేల కోట్లు నిధులు కోరటం జరుగుతుంది. విజయవాడ గ్రేటర్ అయ్యేలోపు ఇప్పుడు వున్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని అన్నారు.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ సుందరీకరణ, అభివృద్ధి కోసం డి.పి.ఆర్ లు తయారు చేయించటంలో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మున్సిపల్ కౌన్సిల్ లో వున్న వైసిపి అభివృద్ధి పనులకు అడ్డుపడుతూ ప్రతి పనిని జాప్యం చేస్తున్నారు. ఎం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారు. ఏపి మున్సిపల్ కౌన్సిల్ వల్ల విజయవాడ నగర అభివృద్ధి కుంటు పడింది. విజయవాడ నగర అభివృద్ధి కోసం డిపిఆర్ తయారు చేయటానికి ఒక ప్రత్యేకమైన ఆర&ఢర్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయవాడ నగర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఎన్ని వేల కోట్లైనా ఇవ్వటానికి సిద్ధంగా వున్నారని తెలిపారు.

## స్వతంత్ర సమరయోధుడు,పంజాబ్ కేసరి లాలా లజపత్ రాయ్ -నేడు ఆయన జయంతి




లాలా లజపత్ రాయ్ భారత్ కు చెందిన స్వతంత్ర సమరయోధుడు,రచయిత మరియు రాజకీయనాయకుడు. పంజాబ్ రాష్ట్రం మోఘా జిల్లా ధుడీకె గ్రామంలో జనవరి 28, 1865 జన్మించి , నవంబరు 17, 1928న బ్రిటిష్ వారి దాడి కారణంగా చికిత్స పొందుతూ మరణించారు. భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ రాజ్కు వ్యతిరేకంగా పోరాడిన ధీరులలో ఒకడుగా చిరస్థాయిగా నిలిచిపోయాడు. ఇతడిని భారతీయులు పంజాబ్ కేసరి అనే బిరుదును ఇచ్చారు. ఇతను పంజాబ్ నేషనల్ బ్యాంకు మరియు లక్ష్మి ఇన్సూరెన్స్ కంపెనీల స్థాపకుడు. లాల్ (లాలా లజపత్ రాయ్), బాల్ (బాలగంగాధర తిలక్), పాల్ (బిపిన్ చంద్రపాల్) త్రయం, ఆకాలంలో లాల్-బాల్-పాల్ గా ప్రసిద్ధి. వీరిలో ఆయన ఒకడు. 1928 లో భారతదేశ పర్యటనకు వచ్చిన సైమన్ విచారణ సంగము (సైమన్ కమిషన్ ) ను వ్యతిరేకించుతు లలా లజపతిరాయి చేసిన ఆందోళన బ్రిటిష్ ఇండియా చరిత్రలో చాల ప్రముఖమైనది. 1920-30 దశాబ్దములో జాతీయకాంగ్రెస్సు వారి మెత్తదనపు మితవాద సిద్ధాంతమును విడనాడి తీవ్రజాతీయవాదు లలో లాలా లజపతిరాయి ప్రముఖుడు. లాలాలజపతిరాయ్ మరణానంతరం బ్రిటీష్ వారిని ఎలాగైన దెబ్బతీయాలని నిర్ణయించుకున్న భగత్ సింగ్ ఆ ప్రతీకారేచ్ఛతోనే భగత్ సింగ్ బృందం స్కాట్ అనుకుని శాండర్స్ అనే అధికారిని హత్య చేశారు. ఆయన స్ఫూర్తితో స్వాతంత్ర ఉద్యమం మరింత ఉధృతమై కొన్నేళ్లకు దేశాన్ని వదిలి బ్రిటీష్ పాలకులు వెళ్లకతప్పలేదు. "నేను మరణించవచ్చు కానీ.. నానుండి వెలువడే ప్రతీ నెత్తురు చుక్క నుంచి లక్షలాది స్వాతంత్ర సమరయోధులు ఉద్భవిస్తారు" అన్న లాలాజీ మాటలు అక్షర సత్యాలయ్యాయి.

## వేములవాడ లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలీసుల సూచనలు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వేములవాడ మున్సిపల్ కార్యాలయం నందు నామినేషన్స్ సెంటర్ ఉన్నందున ప్రజలు పాటించవలసిన సూచనలను వేములవాడ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలియజేశారు. నామినేషన్ సెంటర్ వద్ద వంద మీటర్ల దూరంలో 163 బి ఎన్ ఎస్ ఎస్.(144 సిఆర్పిసి) అమలులో ఉంటుందని, కావున ప్రజలు గుమ్మి గూడ కూడా వద్దు అన్నారు. 1). నామినేషన్ కేంద్రానికి అభ్యర్థి+ఒకరు లేదా ఇద్దరు మంది ప్రతిపాదకులు మాత్రమే అనుమతించబడతారు. 2). నామినేషన్ కేంద్రంలో శాంతిభద్రతలు పాటించాలి, నినాదాలు, ప్రచారం నిషేధం. 3). అభ్యర్థి గుర్తింపు కోసం ఆధార్/ఓటర్ ఐడి వంటి గుర్తింపు పత్రాలు తీసుకురావాలి. 4). నామినేషన్ కేంద్రం బయట ఎన్నికల ప్రచారం పూర్తిగా నిషేధం. 5). నామినేషన్ కేంద్రం పరిసరాలలో నినాదాలు, లౌడ్ స్పీకర్లు, బ్యాండ్లు వాడకూడదు. 6). అభ్యర్థితోపాటు పరిమిత సంఖ్యలోనే అనుచరులు రావాలి. 7). కేంద్రం బయట బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేయరాదు. 8). ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా వాహనాలను దూరంగా పార్క్ చేయాలి. 9). గుంపులుగా చేరడం, గందరగోళం సృష్టించడం నిషేధం.10). ఎన్నికల అధికారుల, పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి. 11). కేంద్రం పరిసరాలలో మద్యం సేవించడం లేదా పంపిణీ చేయడం నిషేధం. 12). ఇతర అభ్యర్థులను బెదిరించడం, అడ్డుకోవడం వంటి అనైతిక చర్యలు చేయరాదు. 13). ఎన్నికల ప్రవర్తన నియమావళి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను ఉల్లంఘించకూడదు. 14). వేములవాడ పట్టణంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉన్నందున ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు చేయాలనుకుంటే సంబంధిత అధికారుల వద్ద పరిమిషన్ తీసుకోవాలి. వేములవాడ మున్సిపల్ ఆఫీసు నందు నామినేషన్ కేంద్రమునందున చెక్కపల్లి చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు వన్ వే ఉంటుంది కావున వాహనదారులు మరియు దుకాణదారులు సహకరించాలని పై సూచనలు సలహాలు పాటించాలని వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల కార్యచరణ విడుదజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్






**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 27 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల కార్యచరణ విడుదల చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల కార్యచరణ ఖరారు అయిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, రిజిస్టర్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో నామినేషన్ల స్వీకరణ, 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే),13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ సంబంధించి నామినేషన్ స్వీకరించేందుకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి సంబంధించి లక్షెట్టిపేట మండల కేంద్రంలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో, క్యాతనపల్లి, బెల్లంపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీలకు సంబంధించి ఆయా మున్సిపల్ కార్యాలయాలలో నామినేషన్ స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-205051 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం,ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోల్ -జోగిపేట మున్సిపల్ పీఠం ఎవరికి దక్కేనో








**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 27 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ఆందోల్-జోగిపేట, మునిసిపల్ ఎన్నికలకు పోటీ చేయాలనుకునే రేసుగుర్రాలకు, కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లెం వేసింది, దీనికి తోడు వార్డులో మైనార్టీలకు స్థానం లభించకపోవడంతో, ఆశావాహులు కాంగ్రెస్ ప్రభుత్వం పై గుర్రు మంటున్నారు, ఈ తరుణంలో మున్సిపల్ పీఠాన్ని కైవాసం చేసుకునేందుకు, ఇరు పార్టీల నాయకులు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ, రాజకీయాన్ని ఆసక్తికరంగా మారుస్తున్నారు, అందోల్ నియోజకవర్గం లో ఉన్న ఏకైక మున్సిపల్ పై, పట్టు సాధించేందుకు, మంత్రి దామోదర పక్క ప్రణాళికతో అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు, ఎలాగైనా మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలని, మంత్రి దామోదర సమీకరణ రసిస్తుంటే, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మునిసిపల్ పై మరోసారి బిఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పావులు కదుపుతున్నారు, ఇరు పార్టీల నాయకుల సర్వేల సమీకరణతో, ఆందోల్- జోగిపేట మున్సిపల్ రాజకీయం హాట్ హాట్ గా మారుతుంది, సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో, ఏకైక మునిసిపాలిటీ ఆందోల్- జోగిపేట మున్సిపాలిటీ, ఈ మున్సిపాలిటీ పై పట్టు సాధించేందుకు, మంత్రి తన పాచికలను రచిస్తున్నారు, ఎలాగైనా అందోల్- జోగిపేట మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని, పట్లు బిగిస్తున్నారు, ఇందుకోసం ఆయన గెలుపు గుర్రాల అన్వేషణలో పడ్డారు, వార్డుల వారిగా మెజార్టీ ఓటర్లు, ఏ ఏ కుల సంఘాల వారు ఎంతున్నారు, అనే విషయాన్ని తన కార్యకర్తల ద్వారా తెలుసుకుంటున్న మంత్రి దామోదర, ఆ దిశగా అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో పడ్డారు, ముఖ్యంగా అంగ బలం,అర్థ బలం, సమీకరణ దృష్టిలో ఉంచుకొని, వార్డుల వారిగా అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో ఉన్న మంత్రి, వార్డుల వారిగా ఒకరి నుండి ముగ్గురుని, లిస్టును తయారు చేశారు, వారిపై తన ప్రత్యేక దూతలతో ఒక సర్వేను, ఇతర కార్యకర్తల అభిప్రాయంతో మరో సర్వేను చేయిస్తున్నారు, ఈ సర్వేలో తేలిన ఫలితాల ఆధారంగా, అభ్యర్థులకు సిట్లను కేటాయించనున్నారని తెలిసింది, ఒకవేళ ఇదే జరిగితే, కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ బెడద మంత్రికి చలనొప్పిగా మారే అవకాశం ఉందని, టాక్ సాగుతుంది, టికెట్ రాణి ఆశావాహులు మంత్రి మాటకు కట్టుబడి ఉంటారా, లేదా మంత్రి ఆదేశాలను ధిక్కరించి బరిలో నిలుస్తారా, అన్నది వేచి చూడాల్సిందే, పార్టీలోని ఈ రాజకీయ పరిణామాలకు చెక్ పెట్టేందుకు, కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ, వార్డుల వారిగా లిస్టును ఇవ్వాల్సిందిగా నాయకులను ఆదేశించారు, ఆ ముఖ్య నాయకులు సమర్పించిన అభ్యర్థుల లిస్టు మేరకు ఒకటి రెండు రోజుల్లో మరోసారి ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, అభ్యర్థులను ఖరారు చేసే ఆలోచనలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఉన్న ఉన్నాడన్నది, హస్తం గుర్తు పార్టీ సన్నిహితుల సమాచారం, అందోల్ నియోజకవర్గం లో ఉన్న ఏకైక మునిసిపాలిటీపై, కాంగ్రెస్ జెండా ఎగురవేసి, తన పట్టును నిలుపుకోవాలని, దానికి అనుగుణంగానే పావులు కదుపుతున్నారు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా, పార్టీ ఆదేశాలతో సంక్షేమ పథకాలు, మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత, అభివృద్ధిపై ప్రచారాన్ని రేత్తిస్తున్నారు, మరోసారి అందోల్ మున్సిపాలిటీపై పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది, ఇందుకు అనుగుణంగా కార్యచరణతో కూడిన ప్రణాళికను సిద్ధం చేస్తుంది, గత ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ కార్యాలయం పై జెండా ఎగురవేసి, మరోసారి పట్టు సాధించేందుకు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఇప్పటికే ముఖ్య నాయకులతో రెండు సార్లు సమావేశం అయ్యారు గత పదిహేను రోజులుగా, వార్డుల వారిగా అభ్యర్థులను ఎంపిక కారారు చేస్తున్నారు, వార్డుల వారిగా సర్వేలు చేయిస్తూ, అధికార పార్టీకి ధీటుగా అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు, ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పట్టణంలో, మైనార్టీలను అణచివేసే కుట్రలో భాగంగా, రిజర్వేషన్లు తెరపైకి తెచ్చి, మాకు అన్యాయం చేశారని మైనార్టీలు మండిపడుతున్నారు, ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీలో 20, వార్డులు ఉన్నాయి, బిఆర్ఎస్ కార్యకర్తలు సైతం, బిఆర్ఎస్ పార్టీ సూచించిన అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధమయ్యారు, అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతే మమ్మల్ని గెలిపిస్తుందని ధీమాతో ఉన్నారు, బిజెపి సైతం అన్ని వార్డులను పోటీ చేసేందుకు సిద్ధమయింది, ఈ 20 వార్డుల్లో పోటీ చేసేందుకు, కమలం గుర్తుకు సరైన అభ్యర్థులు దొరకకపోవడం గమనార్హం, కానీ పోటీ చేసే వార్డుల్లో అధికార పార్టీని ఎదుర్కొనేందుకు బిజెపి పార్టీ సిద్ధమైంది, ఏది ఏమైనా మునిసిపాలిటీ ఓటర్లు ఏవైపు మొగ్గ చూపుతారో వేచి చూడాల్సిందే...

## రాష్ట్రంలో నేరగాళ్ల విచ్చల విడితనం పెరిగిపోయింది: కవిత




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్(నిజామాబాద్)జనవరి : ఎక్స్ జ్ పోలీసులంటే గంజాయి ముఠాలకు భయం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. అబ్కారీ సిబ్బంది వద్ద ఆయుధాలుంటేనే స్మగ్లర్లకు భయం ఉంటుందని అన్నారు. నిజామాబాద్ లో గంజాయి ముఠా చేతిలో గాయపడిన కానిస్టేబుల్ సౌమ్య నిమ్స్ ఆస్పత్రి లో చికిత్స తీసుకుంటున్న సౌమ్యను కవిత పరామర్శించి.. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ఆబ్కారీ, అటవీశాఖ సిబ్బందికి మళ్లీ ఆయుధాలు ఇవ్వాలని, రాష్ట్రంలో నేరగాళ్ల విచ్చల విడితనం పెరిగిపోయిందని మండిపడ్డారు. మాజీ సిఎం కెసిఆర్ ను ఉద్యమకారులు, ప్రజలకు దూరం చేసింది మాజీ ఎంపి సంతోషేనని.. సంతోష్ రావు వల్లే గద్దర్ లాంటి వాళ్లు ప్రగతిభవన్ గేట్ బయట ఉండాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డికి గూఢచారి సంతోష్ రావు అని.. సంతోష్ రావుకు శిక్ష పడుతుందనే నమ్మకం లేదని పేర్కొన్నారు. సిట్ పిలవడం సరే కానీ.. ఏం శిక్షలు పడతాయో చూడాలని అన్నారు. ఫాంహౌస్ లో మాజీ సిఎం కెసిఆర్ ఫుల్ ఇడ్లీ తిన్నారా? సగం ఇడ్లీ తిన్నారా? అనే సమాచారం రేవంత్ కు చేరవేసేది సంతోష్ రావు అని.. బిఆర్ఎస్ లో ఎందరో నేతల కన్నీళ్లకు కారణం సంతోష్ రావేనని అన్నారు. బిఆర్ఎస్ నుంచి ఈటల రాజేందర్ సస్పెన్షన్ కు కారణం సంతోష్ రావేనని, సంతోష్ రావు లాంటి వ్యక్తికి అనుకూలంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ లు పెట్టడానికి బిఆర్ఎస్ శ్రేణులు గమనించుకోవాలని సూచించారు. బిఆర్ఎస్ అన్ని దుర్మార్గాలకు కారణం సంతోష్ రావేనని, ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి తన గూఢచారిని రేవంత్ కాపాడుకుంటారని జోష్యం చెప్పారు. సిట్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కవిత కోరారు.

# రంజాన్ మాసం ప్రశాంతంగా జరుపుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**జనవరి 27, 2026 – ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**పవిత్ర రంజాన్ మాసాన్ని ఎలాంటి అంతరాయాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, మత పెద్దలతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనదని, అందువల్ల అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సహర్, ఇఫ్తార్ సమయాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మసీదుల వద్ద వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. మసీదులు, ఈద్గాల పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పండుగ సమయంలో పండ్లు, నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలో ఉండేలా సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. అధికారులు, మత పెద్దలు సమన్వయంతో రంజాన్ వేడుకలు ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, రంజాన్ మాసంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల భాగంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలలో 'అరైవ్ అలైవ్' అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, యువత రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. రాత్రి 11:30 గంటల తర్వాత అనవసరంగా రోడ్లపై తిరగవద్దని, నాయకులు, పెద్దలు యువతకు సూచించాలని కోరారు.

అనంతరం పలువురు మత పెద్దలు తమ సూచనలు, సలహాలు తెలియజేశారు.

ఈ సమావేశం లో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కలీమ్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మసీదుల కమిటీ సభ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రిజి(స్టేషన్ ఆఫీస్ ను మరో చోటికి తరలిస్తే ఊరుకునేది లేదు. జగ్గారెడ్డి



**సంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి డి(స్ట్రిక్ట్ రిజి(స్టార్ ఆఫీస్, సంగారెడ్డి రిజి(స్టేషన్ ఆఫీస్ ను మరో చోటికి తరలిస్తే ఊరుకునేది లేదు.

.. ఇంటి గ్రేటెడ్ రిజి(స్టేషన్ కార్యాలయం పేరు తో పఠాన్ చెరు నియోజకవర్గం కర్ధనూర్ కు తరలించేందుకు అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేఖిస్తున్న కావాలంటే పఠాన్ చెరు సబ్ రిజ(స్టార్ కార్యాలయాన్ని పఠాన్ చెరు కు తీసుకుపొండి

నేను జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహా, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో మాట్లాడేవరకు ఎలాంటి తరలింపు ఆలోచన చేయవద్దు

రిజి(స్టేషన్ శాఖ అధికారులకు ఇది నా సూచన× హెచ్చరిక

## బీజేపీ హిట్లర్ పాలన తలపిస్తోంది వి. హనుమంతు రావు



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:**

రిపబ్లిక్ డే రోజు అపోజిషన్ లీడర్స్ కి అవమానం జరిగింది

ఢిల్లీ పరియడ్ లో సిట్టింగ్ అరెంజ్ మెంట్ లో అపోజిషన్ లీడర్ ఇంపార్టెన్స్ ఇవ్వలేదు

రాహుల్ గాంధీ కి మూడో లైన్ లో అలోకేట్ చెయ్యటం సరీ కాదు

గతం లో మొదటి లైన్ లో కూర్చోబెట్టి సంస్కృతి ఉంది

అపోజిషన్ లీడర్ కి సరి ఐన స్థానం ఇవ్వాలి అని రాజ్యాంగం లో ఉంది

బీజేపీ హిట్లర్ పాలన తలపిస్తోంది

దేశాన్ని ముక్కలు చేసి ప్రభుత్వం లో కొనసాగాలి అని బీజేపీ చేస్తుంది

బిజెపి రాజ్యాంగాన్ని గౌరవించరు , జాతి పితని గౌరవించరు

జాతి పీతకి , అంబేత్కర్ ని సైతం అవమానించారు

ఈ డిక్టేటర్ పాలనని నేను కండిస్తున్న

## ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవాలి బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్



జోగులాంబ గద్వాల జిల్లా, జనవరి 27 : గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవాలని మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. గద్వాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై మండిపడ్డారు.గద్వాల పట్టణంలో ఎవరికి ఓటు అడిగే హక్కు లేదని, ఎవరు ఏమి అభివృద్ధి చేశారో పట్టణ ప్రజలకు తెలుసని అన్నారు. తెలంగాణ స్పీకర్ ఇచ్చిన తీర్పు ప్రకారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో ఆ పార్టీ కండువా కప్పుకుని ఎన్నికల్లో తిరగాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు.స్పీకర్ నిర్ణయాన్ని ఎమ్మెల్యే బండ్ల గౌరవించాలన్నారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యే బండ్ల ఇప్పుడున్నది కాంగ్రెస్ పార్టీలోనని గద్వాల ప్రజలందరికీ తెలుసు. తాను కాంగ్రెస్‌లో ఉన్నా అని చెబితే.. కాంగ్రెస్ కండువా వేసుకొని తిరిగితే ఎమ్మెల్యే పదవి ఊడిపోతదని ఎమ్మెల్యే బండ్ల ఏదో అబద్దాలు చెప్పుకుంటూ తిరుగుతున్నరన్నారు. ఆయన ఏ మొహం పెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం చేస్తారన్నారని ప్రశ్నించారు.ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ పాట పాడటం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికే సొంతమని డీకే అరుణ అన్నారు. గద్వాల పట్టణ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, పట్టణ ప్రజలు గద్వాల అభివృద్ధి కావాలంటే బీజేపీకి పట్టం కట్టాలని డీకే అరుణ కోరారు.

# దార్లపల్లి లో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న గ్రామ సర్పంచ్, తలారి దుర్గమ్మ బాల్ రాజు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 27 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం దార్లపల్లి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రం చేయిస్తున్న గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బా(లాజు, గ్రామపంచాయతీ సమావేశంలో గ్రామంలో ఉన్న పరిసరాలు పరిశుభ్రం పాడుపడిన ఇల్లు పరిశుభ్రం చేయించడం పట్ల గ్రామ ప్రజలతో చర్చించి ఇంటి ఓనర్లతో చర్చించి సామరస్యంగా పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజు, ముస్తాక్,మన్నె నాగేష్ ,అన్నమయ్య, ఇండ్ల ముందు ఉన్న రాళ్లు మట్టి దిబ్బలు చెట్ల పొదులు అలము పరిశుభ్రం చేయించడం జరిగిందని తెలిపారు , అదేవిధంగా దార్లపల్లి నుండి పట్లూర్ వెళ్లే రహదారి ప్రజలకు ఇబ్బందికరంగా అస్తవ్యస్తంగా రోడ్డు పూర్తిగా పాడైన విషయం గమనించి రోడ్డుపై ట్రాక్టర్ ద్వారా మట్టి వేయించి రోడ్డును సరాళం చేసినట్టు తెలిపారుఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజు, సెక్రటరీజ్యోతిలింగం,పరుశురాం ,సత్యనారాయణ ,ముష్టి నిరంజన్ ,కృష్ణ ,గోవర్ధన్ ,రమేష్, బలరాం సైదులు, మరియు గ్రామ పెద్దలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు



## తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించిన జపాన్ దేశంలోని ఐచి రాష్ట్ర అసెంబ్లీ సభ్యుల బృందం

## జపాన్ బృందాన్ని,తెలంగాణ శాసనసభాపతి ఘనంగా సన్మానం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 27(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించిన జపాన్ దేశంలోని అయిచి (ూాఆఎష్ట్రఆ) రాష్ట్ర అసెంబ్లీ సభ్యుల బృందతో కూడిన అయిచి ఎకనామిక్ డెవలప్మెంట్ ఫోరం.

ఫోరం చైర్మన్ హిరిహితో కోండో మరియు తొమ్మిది మంది అయిచి రాష్ట్ర ఎమ్మెల్యేల బృందానికి స్వాగతం పలికి, శాలువా, పుష్ప గుచ్ఛాలతో సన్మానించి సమావేశమైన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలంగాణ శాసనసభ లో కలవడం జరిగింది అని తెలిపారు




## సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కమఠం శ్రీనివాస రావు ని పరామర్శించిన వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు



**ఖమ్మం ప్రతినిధి జనవరి 27 (ప్రజాబలం)** ఖమ్మం సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కమఠం శ్రీనివాస రావు గారిని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) జిల్లా ప్రతినిధి బృందం పరామర్శించింది. ఇటీవల (ది. 17.01.2026) శ్రీనివాసరావు అమ్మ గారైన కమఠం సత్యవతి గారు మరణించారు. విషయం తెలుసుకున్న డబ్ల్యూజేఐ ప్రతినిధులు యూనియన్ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటికి వెళ్ళి శ్రీనివాస రావు తో పాటు ఆయన సోదరుడు కమటం రఘు లను పరామర్శించారు సత్యవతి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని వేడుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆమె మరణానికి దారి తీసిన కారణాలను, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస రావు ని పరామర్శించిన వారిలో డబ్ల్యూజేఐ జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో కన్వీనర్లు యెన్నెబోయిన శ్రీనివాస రావు, ఎం.ఏ అన్సార్ పాషా, అమరనేని రామకృష్ణ, నాగరాజు దేవర, సభ్యులు కట్టెకోల చిన నరసయ్య, జాబిశెట్టి కుటుంబ రావు, బొడ్డు పల్లి రవీందర్, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి తదితరులు వున్నారు

# గుండ్లపల్లిలో కార్డాన్ సెర్చ్

పల్నాడు నకరికల్లు మండలం గుండ్లపల్లిలో పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 41 బైకులు,రెండు ఆటోలు,పలు మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లి డీఎస్పి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన నిర్బంధ తనికీలు జరిగాయి. .

## విద్యార్థుల కొరకు ప్రత్యేక ప్రేరణ- అవగాహన తరగతులుజిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)పి.చంద్రయ్య





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 27 :** జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణ అవగాహన తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులముల వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులకు మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహాలలో చదువుచున్న 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణ-అవగాహన తరగతులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, ఇష్టంతో చదివి,పట్టుదలతో సాధించి ఉన్నత స్థానాలలో నిలవాలని,తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ప్రేరణ-అవగాహన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, విషయ నిపుణులైన ఉపాధ్యాయులు ఇచ్చే మెలకువలను పాటించి,అన్ని సబ్జెక్టులలో 100 శాతం మార్కులు సాధించాలని,వార్షిక ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణతతో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహాలలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని,10వ తరగతి విద్యార్థులకు స్పెషల్ డైట్, స్టడీ మెటీరియల్ అందించడం జరుగుతుందని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ధర్మానంద్ గౌడ్, ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 27 :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల లోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి అన్వేష్ తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ...మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రంలో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని,నామినేషన్, పోలింగ్,కౌంటింగ్ ప్రక్రియలను ఎన్నికల నిబంధనలకు లోబడి పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 27 :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన (స్టాంగ్ రూమ్,నామినేషన్, డిస్ట్రిబ్యూషన్,కౌంటింగ్ కేంద్రాలను లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని,నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను ఎన్నికల నిబంధనలకు లోబడి పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో చేపట్టిన పోస్ట్ మార్టం కేంద్రం నిర్మాణ పనులను తెలంగాణ వైద్య విధాన పరిషత్ అధికారి కోటేశ్వర్ తో కలిసి పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని వార్డులు,ల్యాబ్, ఓ. పి., రిజిస్టర్లు,పారిశుద్ధ్య పనుల నిర్వహణ ను పరిశీలించారు. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పారిశుద్ధ్య నిర్వహణ పక్క బందీగా చేపట్టాలని తెలిపారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడుతూ వారికి అందిస్తున్న సౌకర్యాలు, ఆహారం, వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించొద్దు...

### సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 27(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లా కేంద్రంలో గత మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పటాన్‌చెరు మండలం కర్ధనూర్ గ్రామానికి తరలించాలన్న ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు,ఈ మేరకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ హౌసింగ్ మరియు ఐటీ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ లేఖ రాశారు,సంగారెడ్డీ జిల్లా కేంద్రం కావడంతో అన్ని జిల్లా స్థాయి కార్యాలయాలు ఇక్కడే కొనసాగాలని పరిపాలనా నిబంధనలు స్పష్టంగా పేర్కొంటున్నాయని ఆయన లేఖలో తెలిపారు,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సంగారెడ్డిలో ఉండటం వల్ల ప్రజలకు సులభంగా అందుబాటులో ఉందని దీనిని మారిస్తే వృద్ధులు మహిళలు రైతులు దినసరి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు,కార్యాలయం తరలింపుతో ప్రయాణ దూరం పెరిగి అదనపు ఖర్చులు సమయ నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు,ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రజల ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడుతుందని, ప్రభుత్వ సేవల సాఫీగా అందడంలో ఆటంకాలు ఏర్పడతాయని పేర్కొన్నారు,అందువల్ల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంగారెడ్డి నుంచే కొనసాగించేలా నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని మంత్రికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు,ఈ లేఖ ప్రతిని సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు కూడా పంపించారు

## పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 27 :** రాష్ట్రంలో పారదర్శకమైన మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు.మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డి. జి. పి. శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు- కలెక్టర్లు, జిల్లా అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, నామినేషన్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, జోనల్, నోడల్ అధికారులు, పర్యవేక్షణ బృందాలు, పి ఓ లు, ఎ పి ఓ లు, ఎన్నికల సిబ్బంది నియామకం ప్రతి అంశంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమాలని ఖచ్చితంగా పాటించాలని, ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ కేంద్రాలు, (స్టాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఎన్నికలలో వినియోగించే బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారదర్శకంగా,నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పర్యవేక్షించాలని, స్వేచ్ఛగా, నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో 34 వార్డులు, చెన్నూర్ మున్సిపల్ పరిధిలో 18 వార్డులు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 22 వార్డులు, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 15 వార్డులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా వెబ్ కాస్టింగ్, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, పి ఓ లు, ఓ పి ఓల నియామకం, శిక్షణ,ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు,(స్టాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని,అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేట గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న

### మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 27 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** 77వ జాతీయ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, జోగిపేట పట్టణంలోని, బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఆవరణలో, పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు, అభిమానులతో కలిసి, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జాతీయ జెండాను ఎగరవేశారు, అనంతరం జోగిపేట పట్టణంలో, మాజీ సీఎం కేసీఆర్ నిర్మింప చేసిన, డబుల్ బెడ్ రూమ్ ల వద్ద కూడా జాతీయ జెండాను ఎగరవేసిన ఆయన, ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, తో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి,నారాయణ, డి,బి, నాగభూషణం, మాజీ ఎంపిటిసి పట్లూరి శివ శేఖర్, మాజీ ఎంపిటిసి రామా గౌడ్, మాజీ సర్పంచులు లింగాగౌడ్ , ఏ,శంకరయ్య, ముద్దాయిపేట విజయ్, పార్టీ సీనియర్ నాయకులు చేపల వెంకటేశం, సారా శ్రీధర్, కుమార్, బీర్ల శంకర్, మహేష్ యాదవ్, కాజా పాషా, ఎర్ర సాయిలు, రఫిక్, జహంగీర్ ఖాన్, జిన్నా, విజయకుమార్, తో పాటు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.....

# ముస్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధం...

# ముస్సిపల్ కమిషనర్లు,ఆర్వోలు,ఏఆర్వోలు, టిఓటి లకు శిక్షణ తరగతులు






**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 27(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించి విజయవంతమైన ఎన్నికలకు తోడ్పడాలని అడిషనల్ కలెక్టర్ పాండు పేర్కొన్నారు,మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మున్సిపల్ కమిషనర్లు,రిటర్నింగ్ అధికారులు,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు,టిఓటి లకు శిక్షణ తరగతులను నిర్వహించారు,ఈ శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు పాల్గొని మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో ప్రతి ఎన్నికల అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఎన్నికల నిర్వహణ జరగాలన్నారు,రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల పాత్ర ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎన్నికల నిర్వహణ లో అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు,ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల విధులు, బాధ్యతలు, అధికార పరిధి, ఎన్నికల నిబంధనల అమలు, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై పలు కీలక సూచనలు చేశారు,అనంతరం శిక్షణలో భాగంగా మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల సంఘం నిబంధనలు, మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన విధివిధానాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నామినేషన్ ప్రక్రియ, పోలింగ్ రోజు చేపట్టాల్సిన చర్యలు, ఓట్ల లెక్కింపు విధానం తదితర అంశాలపై సమగ్రంగా వివరించి మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు,టిఓటి లకు అవగాహన కల్పించారు,శిక్షణ సమయంలో పలువురు అధికారులు అడిగిన సందేహాలకు మాస్టర్ ట్రైనర్ స్పష్టమైన వివరణ ఇచ్చి నివృత్తి చేశారు,ఈ శిక్షణ కార్యక్రమంలో 11 మంది మున్సిపల్ కమిషనర్లు,103 మంది రిటర్నింగ్ అధికారులు,103 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు,22 మంది ట్రైనింగ్ ఆఫ్ ట్యూటర్స్ శిక్షణ పొందారు,ఈ కార్యక్రమంలో శిక్షణ తరగతుల నోడల్ అధికారి రామాచారి,మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులు,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు,టిఓటీలు పాల్గొన్నారు.

# సదాశివపేటలో మొదటి విడతగా 8 మంది అభ్యర్థులను ప్రకటించిన బిఆర్ఎస్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 27(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సదాశివపేట/మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మొదటి విడతగా 8 మంది అభ్యర్థులను ప్రకటించింది,ఈ క్రమంలో బిఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల పర్యవేక్షకులు ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి,సఫాన్ దేవ్,మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాల పట్ల విసిగిపోయారని వారి మాటలు నమ్మే పరిస్థితి లేదని ఇచ్చిన హామీలను నెరవేర్చలేని పరిస్థితిలో పనులు పార్టీ ఉందని మున్సిపల్ ఎన్నికలలో ఎలాంటి హామీలు ఇచ్చిన నమ్మకూడదని అన్నారు సపనదేవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చలేదని ఇప్పుడు ఎలాంటి హామీలు ఇచ్చిన ప్రజలు వినడానికి సిద్ధంగా లేరని విద్యార్థులకు 5 లక్షల గ్యారెంటీ కార్డు ఇప్పటికి ఒకరికి కూడా ఇవ్వలేదని తులం బంగారం ఎవరికి ఇవ్వలేదని 2500 పెన్షన్ ఒకరికి కూడా ఇవ్వలేదని అన్నారు,ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు మొదటి విడతగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన 8 మంది కౌన్సిలర్ అభ్యర్థులను ప్రకటించినట్లు తెలిపారు,మిగిలిన అభ్యర్థుల జాబితాను రేపు లేదా ఎల్లుండి ప్రకటిస్తామని స్పష్టం చేశారు,మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ నాయకులు వస్తే ప్రజల నిలదీయడానికి సిద్ధంగా ఉన్నామని బిక్షపతి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు,గడప గడపకు బాకీ కార్డులు పంపిణీ చేస్తుండగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం పూర్తిగా కోల్పోయిందని స్పష్టం చేశారు,ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం బిఆర్ఎస్ నాయకులు చింత సాయినాథ్,మార్కెట్ కమిటీ చైర్మన్ కోడూరు రమేష్, మున్సిపల్ మాజీ కౌన్సిల్ సభ్యులు కలీం పటేల్, మండల పార్టీ అధ్యక్షులు పెద్ద గొల్ల ఆంజనేయులు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అంజయ్య,మాక్సూద్ హుస్సేన్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ అక్బర్ హుస్సేన్,బిఆర్ఎస్ ముఖ్య నాయకులు ఆత్మకూరు నాగేష్,తదితరులు పాల్గొన్నారు ప్రకటించిన టిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి వివరాలు కింది విధంగా ఉన్నాయి 2 వార్డు పాండు నాయక్,5 వార్డు రజియా బేగం,6 వార్డు నాగుల విజయ్,10 వార్డుసాతాని శ్రీశైలం,15 వార్డు నాసిర్,17 వార్డు కమిల్ అన్సార్,20 వార్డు ఆకుల మంజుల శివకుమార్,22 వార్డు వడ్ల మహేశ్వరి వీరేశం.

# గౌడ వృత్తిదారుల హక్కులను కాపాడేందుకు పోరాటానికి సిద్ధం

## తహసిల్దార్కు ఫిర్యాదు చేసిన గౌడ మండల అధ్యక్షుడు నాయబ్ గౌడ్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 27(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఈత చెట్లను నరికివేయడం గౌడ కులస్తుల జీవనంపై నేరుగా దాడి చేయడమేనని గౌడ సంఘం నాయకులు తీవ్రంగామండిపడ్డారు. ఈ నెల 24 వ తేదీన మండల కేంద్రంలో నీ సర్వే నంబర్ 134/1, 134/2లలో అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు తొలగించిన ఈత చెట్ల పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మర్పల్లి మండలం గౌడ సంఘం మండల అధ్యక్షుడు నాయబ్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ పురుషోత్తం కు ఫిర్యాదు అందజేశారు,ఈ సందర్భంగా గౌడ సంఘం మండల అధ్యక్షులు నాయబ్ గౌడ్ మాట్లాడుతూ, "ఈత చెట్లు గౌడల జీవనాధారం వాటిని నరికివేయడం అంటే మా కుటుంబాల ఉపాధిని నాశనం చేయడ మే అని కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగించేవారు అనేకమంది గౌడ కులస్తులు ఉన్నారని ప్రభుత్వం లైసెన్సులు జారీ చేయాలంటే కచ్చితంగా ఈత చెట్లు ఉండాలని నిబంధన ఉందని దీంతో ఈత చెట్లను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈత చెట్లు తొలగించిన అగ్రవర్ణాలపై తగిన చర్యలు తీసుకోవాలని లేని యెడల గౌడ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు,మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోనూ అక్రమంగా ఈత చెట్లు నరికివేస్తున్నా సంబంధిత శాఖలు చూస్తూ ఊరుకుంటున్నాయని నాయకులు ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు తప్పవని స్పష్టం చేశారు. గౌడ వృత్తిదారుల హక్కులను కాపాడేందుకు అవసరమైతే పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు,ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల ఉపాధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, రమేష్ గౌడ్, బలరాం గౌడ్, వీరేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొని తమ నిరసనను ఘాటుగా వ్యక్తం చేశారు,తహసిల్దార్ ఫిర్యాదును స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు, సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు స్పష్టం చేశారు.

# టిజియుఈఈయు సిఐటియు ఖమ్మం జిల్లా స్థాయి డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ

## ముఖ్యఅతిథి గా హాజరైన ఖమ్మం జిల్లా సూపరెంటెండ్ ఇంజనీర్ ఈ శ్రీనివాసచారి

## విశిష్ట అతిథులుగా రూరల్ డివిజన్ డిఈ సిహెచ్ నాగేశ్వరావు ఖమ్మం టౌన్ డివిజన్ డిఈ ఎన్ రామారావు

**ఖమ్మం ప్రతినిధి జనవరి 27 (ప్రజాబలం)** జిల్లా టిజియుఈఈయు సిఐటియు క్యాలెండర్ డైరీ ఆవిష్కరించిన కార్యక్రమం అట్టహాసంగా ఖమ్మంలో జరిగింది ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా సూపరెంటెండ్ ఇంజనీర్ ఈ శ్రీనివాసచారి హాజరై క్యాలెండర్ డైరీ నీ ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనియన్లు ఉద్యోగుల భద్రత రక్షణ











కొరకు పోరాడాలని కోరారు ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా డి ఈ లు నాగేశ్వరరావు రామారావు ఎస్ పిఎం డిఈ భద్రపవార్ హాజరయ్యారు ఈ కార్యక్రమంలో డిఈటి బాబు రావు ట్రాన్స్కో డిఈ దాసు ఎస్ఏఓ జి శ్రీధర్ లు యూనియన్ జిల్లా నాయకులు బి పుష్ప రాణి ,సిహెచ్ ముకుంద రెడ్డి కే నాగేశ్వరరావు రాష్ట్ర నాయకులు ఎం ప్రసాద్ రూరల్ డివిజన్ అధ్యక్షులు ఎం సత్యనారాయణ రెడ్డి కార్యదర్శి ఎన్ సీతయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ డి గోపిరెడ్డి ఎక్స్ ఆర్టిజన్ జేఏసీ చైర్మన్ గంట శ్రీనివాసరావు కో కన్వీనర్ ఎల్వీ కృష్ణారావు, కుసుమంచి సబ్ డివిజన్ నాయకులు రామయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ కమలాకర్ శ్రీకాంత్ మహిళ ప్రతినిధులు, సంధ్య హాజరైన లైన్ ఇన్స్పెక్టర్లు ఎల్ఎంలు జేఏఓ లు మీటర్ రీడర్లు బిల్లు కలెక్టర్లు ఆన్ మేన్ కార్మికులు స్టోర్ అమాలీలు ఎస్పీఎం కార్మికులు ఆర్టిజన్ కార్మికులు మహిళ కార్మికులు ఉద్యోగినీలు తదితరులు పాల్గొన్నారు

# మణికొండలో వాలీ బాల్ టోర్నమెంట్.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 27 జనవరి 2026,** 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భముగా ఠాకూర్ దీపక్ సింగ్ ఆధ్వర్యములో సోమవారం రోజున మణికొండ బతుకమ్మ గ్రౌండ్ లో వాలీ బాల్ టోర్నమెంట్ జరిగినవని టౌర్నమెంట్ ఆర్గనైజర్స్ తెలియ జేసినారు. ఇట్టి కార్యక్రమంలో ఆరు టీమ్ లు పోటీ పడడం దృష్టా పోటీలు ఉదయం మొదలై రాత్రి వరకూ కొనసాగినవని, ఎట్టకేలకు సాయి టీం మొదటి ప్రైజ్ గా బంగారు పతకం సాధించగా రెండవ ప్రైజ్ వెండి పథకం శ్రీకాంత్ టీం సాధించినారని ఠాకూర్ దీపక్ సింగ్ తెలియ జేసినారు.

# గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యం..



**.సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 27(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** ఆందోల్/పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెండికోల్ గ్రామ శివారులో ఉన్న చెరువు వద్ద ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది,మృతుడు సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి, మృతుడు నీలం రంగు ఫుల్ కట్ అండర్వేర్ మరియు క్రీమ్ రంగులో నిలువు గీతలతో ఉన్న కాలర్ లేని టీ-షర్ట్ ధరించి ఉన్నాడు,ఈ మృతదేహానికి సంబంధించి ఎవరికైనా సమాచారం ఉన్నట్లయితే లేదా వ్యక్తిని గుర్తించినట్లయితే,వెంటనే క్రింది నంబర్లను సంప్రదించాలని పుల్కల్ పోలీసులు కోరుతున్నారు.సంప్రదించవలసిన నంబర్లు:పుల్కల్ పోలీస్ స్టేషన్: 8712661837,పుల్కల్ ఎస్ఐ:8712656754,జోగిపేట సీఐ:8712656723,ప్రజలు సహకరించి, సమాచారం అందించి దర్యాప్తుకు తోడ్పడాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# రాయసముద్రం చెరువును అభివృద్ధి చేస్తాం

## ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్న హైడ్రా కమిషనర్



**సంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:**సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పరిధిలోని రాయసముద్రం(రామచంద్రాపురం) చెరువును సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఈమేరకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. గతంలో ఉన్న ప్రతిపాదనల మేరకు హెచ్ ఎం డీఏ అభివృద్ధి చేస్తే ఇందుకు ఉన్న ఆటంకాలను తొలగించి.. అభివృద్ధిలో సహకరిస్తామన్నారు. చెరువు అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని స్థానిక అధికారులు, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు ఇన్‌లెట్లను, ఔట్‌లెట్లు ఎలా ఉన్నాయో గమనించి స్థానిక సమస్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. రాయసముద్రం చెరువు సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువును కేవలం ఒక నీటి వనరుగానే కాకుండా.. స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే ఒక చక్కని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం ప్లే ఏరియా, పార్కులు, అన్ని వయసుల వారు వ్యాయామం చేయడానికి పరికరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వలస పక్షులకు నిలయంగా ఉన్న ఈ చెరువును పూర్తి స్థాయిలో కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



బీ హెచ్ ఈ ఎల్ యాజమాన్యంతో మాట్లాడుతాం.. చెరువులోకి మురుగు నీరు చేరకుండా దారి మళ్లించే పైపులైన్ల నిర్మాణానికి BHEL యాజమాన్యంతో మాట్లాడి .. వారి స్థలంలో పనులకు ఆటంకం లేకుండా చూస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. ఎస్‌టీపీ ఏర్పాటు చేయాల్సినవసరముందున్నారు. చెరువు భూములపై BHEL మరియు ఇతర ప్రభుత్వ సంస్థల మధ్య ఉన్న సాంకేతిక పరమైన వివాదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు ఉన్నతాధికారులతో చర్చించి స్పష్టత ఇస్తామన్నారు. హైడ్రా అధికారులు వచ్చారంటే ఇళ్ళు కూల్చివేస్తారని ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటికే నిర్మించుకున్న ఇళ్ళ విషయంలో హైడ్రా జోక్యం చేసుకోదు. కేవలం నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలు, ఇతర అడ్డంకులను తొలగించి ప్రజలందరికీ మేలు చేయడమే మా లక్ష్యం. తప్పనిసరి పరిస్థితుల్లో ఆక్రమణలు తొలగించాల్సి వస్తే..ప్రభుత్వం ద్వారా వారికి పరిహారం అందేలా చూస్తామన్నారు. జీహెచ్ ఎంసీ, హెచ్ ఎండీఏ, ఇరిగేషన్, బీహెచ్ ఈఎల్ అధికారులతో పాటు.. స్థానిక నాయకులు కమిషనర్ పర్యటనలో ఉన్నారు. చెరువు చుట్టూ తిరిగి ఇన్‌లెట్లద్వారా మురుగు నీరు చేరుతున్న విధానాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు.

## సదాశివపేటలో దొంగ ఓట్ల పై పిర్యాదు చేసిన కాంగ్రెస్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 27(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సదాశివపేట/స్థానిక మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన క్రమంలో సదాశివపేట పట్టణంలో దొంగ ఓట్ల పై పిర్యాదు చేయటంతో ఒక్కసారిగా పట్టణ ప్రజలు షాక్ కి గురయ్యారు దాదాపు 2,365 దొంగ ఓట్లు ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ గుర్తించినట్లు తెలిపింది, అనంతరం దొంగ ఓట్లు నమోదు చేసుకున్న వారి పై స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు, ఈ క్రమంలో సదాశివపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు భారీగా దొంగ ఓట్లు నమోదు చేయించి గత ఎన్నికల్లో దొంగ చాటుగా గెలిచారు అని ఎద్దేవా చేశారు, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా దొంగ ఓట్లు ఉన్నవారిని ఓటు వేయకుండా వారి పైన చర్యలు తీసుకోవాలని అన్నారు,వార్డుల వారిగా ఉన్న దొంగ ఓట్ల వివరాలు వార్డ్ నెంబర్ 4 -650 వార్డ్ నెంబర్ 6 -400 వార్డ్ నెంబర్ 8- 80 వార్డ్ నెంబర్ 10-50 వార్డ్ నెంబర్ 11 -250 వార్డ్ నెంబర్ 14-60 వార్డ్ నెంబర్ 15-100 వార్డ్ నెంబర్ 16 -90 వార్డ్ నెంబర్ 17-30 వార్డ్ నెంబర్ 18-40 వార్డ్ నెంబర్ 19-28 వార్డ్ నెంబర్ 20-19 వార్డ్ నెంబర్ 21 -8 వార్డ్ నెంబర్ 21- 80 వార్డ్ నెంబర్ 22 -120 వార్డ్ నెంబర్ 23- 70 వార్డ్ నెంబర్ 24- 250 వార్డ్ నెంబర్ 26-40, మొత్తం 2365 దొంగ ఓట్లు ఉన్నాయని తెలిపారు,ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు, కాంగ్రెస్ నాయకులు శరత్ చంద్ర, గుండు రవి, నాగరాజు గౌడ్,శంకర్ గౌడ్,రాయపాడు రమేష్,బిట్ల ప్రేమ్ కుమార్, భరత్, రహమత్,తన్వీర్,వాజీద్, మజీద్,మోహిస్,సజ్జాద్,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ అమలు: కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జనవరి 27:**మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆలియాబాదు, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నందున తేది 27-1-2026 సాయంత్రం నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి ననుసరించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. తేది 28-1-2026 నుండి 30-1-2026 వరకు నామినేషన్లు స్వీకరించబడతాయని, నామినేషన్ల (స్క్రూటిని తేది 31-1-2026 నుండి నిర్వహించి అనంతరం తేది 3-2-2026న మధ్యాహ్నం 3.00 గంటల వరకు అభ్యర్థులు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని, తుది జాబితా అదేరోజు ప్రకటిస్తారని తెలిపారు. తేది. 11-2-2026 పోలింగ్ జరుగుతుందని, కౌంటింగ్ 13-2-2026న జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ, శాంతిభద్రతలను కాపాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్టంగా అమలు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరిగిందని అన్నారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ ఈ ఈ ఈ పి సి సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరిగిందని తెలిపారు.

# బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ. బోనం సమర్పించడానికి 2 గంటల సమయం.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన శ్రీ బద్ది పోచమ్మ ఆలయం లో మంగళవారం రోజున భక్తుల రద్దీతో కిటకిటలాడింది. గురువారం రోజు నుండి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో ముందుగా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని, శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. అందులో భాగంగానే మంగళవారం రోజున వేకువజాము నుండే భక్తులు భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి, బోనం తయారుచేసి కుటుంబ సమేతంగా, డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా శ్రీ బద్ది పోచమ్మ ఆలయానికి చేరుకొని, శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి తమ పిల్లాపాపలను, తమ పాడి పంటలను, చల్లంగా చూడాలని మొక్కుకొని బోనాలు సమర్పించినారు. భారీ సంఖ్యలో బద్ది పోచమ్మ ఆలయానికి భక్తులు తరలి రావడంతో బోనాలు సమర్పించడానికి సుమారుగా రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినారు. భక్తుల రద్దీతో శ్రీ బద్ది పోచమ్మ ఆలయ పరిసర ప్రాంతాలలో భక్తుల సందడి నెలకొంది.



# వేములవాడ పట్టణంలో బిజెపి ఆధ్వర్యంలో ఎన్నికల విజయసంకల్ప సమావేశం.

## ముఖ్యఅతిథిగా ఇనుగాల పెద్దిరెడ్డి హాజరు.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** మంగళవారం రోజున వేములవాడ పట్టణంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల విజయసంకల్ప సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మరియు వేములవాడ బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు హాజరైనారు. ఈ సందర్భంగా ఇనుగాల పెద్దిరెడ్డి మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీలకు చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదనేది స్పష్టంగా తెలుస్తుందని, మున్సిపాలిటీలలో అంతో ఇంతో అభివృద్ధి పనులు జరిగాయి అంటే అవి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అనేది ప్రజలకు తెలిసిన సత్యం అని పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే నయా పైస రాదనేది ఎంత సత్యమో, బి ఆర్ఎస్ కు ఓటు వేస్తే అది వృధా అనేది కూడా అంతే సత్యమన్నారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో బిజెపికి ఓటు వేస్తేనే కేంద్రం నుండి నిధులు వస్తాయనే విషయాన్ని ప్రజలు గమనించాలని, తెలంగాణ వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో, బిజెపి పార్టీకి పట్టం కట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వేములవాడ పట్టణ అభివృద్ధికి పార్టీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీ భవిష్యత్తును నిర్దేశించే కీలక ఎన్నికలని, ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యచరణ రూపొందించాలని, పార్టీ శ్రేణులు అంత ఐక్యంగా, సమన్వయంతో పనిచేస్తే మున్సిపల్ ఎన్నికలలో విజయాన్ని సాధించడం ఖాయమని నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలోని 13వ వార్డుకు చెందిన సుదర్శన్ శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో కోనాయపల్లి పరిధిలో దాదాపు 300 మంది కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిజెపి పార్టీలో చేరడం జరిగింది. అలాగే వేములవాడ మునిసిపల్ విలీన గ్రామమైన శాతరాజు పల్లెకు దాదాపు 20 మంది వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు మంగళవారం రోజున ఇనుగాల పెద్దిరెడ్డి సమక్షంలో బిజెపి పార్టీ లో చేరడం జరిగింది. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపి. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, బిజెపి రాష్ట్ర నాయకుడు, జిల్లా మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జి లింగంపల్లి శంకర్, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, కౌన్సిల్ మెంబర్ కృష్ణస్వామి, వేములవాడ మున్సిపల్ ఇంచార్జి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం యాదవ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్, సీనియర్ బిజెపి నాయకులు మల్లికార్జున్, అన్ని మండలాల అధ్యక్షులు, కౌన్సిల్ మెంబర్లు, పట్టణ సీనియర్ నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన విభాగం నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంటోన్మెంట్ ఎం.ఎల్. ఏ. గణేష్ రిలే నిరాహర దీక్షకు లోకసత్తా పార్టీ సంఘీభావం




**ప్రజాబలం ప్రతినిధి:**హైదరాబాద్ జనవరి 27సికింద్రాబాద్ కాంటోన్మెంట్ లో గల పౌర నివాస ప్రాంతాలను గ్రేటర్ హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనం చేయాలని స్థానిక ఎం.ఎల్. ఏ. శ్రీగణేష్ చేపట్టిన రిలే నిరాహర దీక్షకు సంఘీభావం తెలియ జేశారు. 7వ రోజున లోకసత్తా పార్టీ రాష్ట అధ్యక్షులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ పౌర నివాస ప్రాంతంలో నాలుగు లక్షల మంది పౌరులు నానా యాతన పడుతున్నారని ఇక్కడి స్థానిక పౌర సమస్యల పరిష్కారం కేంద్ర, రాష్ట ప్రభుత్వాల పరిధిలో కాకుండా కేంద్ర రక్షణ శాఖ పరిధిలో ఉండడంతో మౌలిక వసతుల కల్పన,రోడ్లు, మంచినీరు, డ్రైనేజ్, ఇంటి నిర్మాణానికి అనుమతులు వంటి ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచుకోక పౌరులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం గజెట్ నోటిఫికేషన్ జారీచేసినా రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం లేదని ప్రకటించినా తాత్సారం దేనికని ఆయన సూటిగా ప్రశ్నించారు. విలీన ప్రక్రియ కాంటోన్మెంట్ ప్రజల న్యాయమైన డిమాండ్ మరియు ప్రజాస్వామిక హక్కు అని తుమ్మనపల్లి స్పష్టం చేశారు. ఇంకా ఈ నిరాహర దీక్షలో ఉపాధ్యక్షులు నందిపేట రవీందర్, కార్యదర్శులు మల్లాది కిషోర్, శివరామ కృష్ణ, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com